
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS

డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 159 | ది.25-9-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 159 | Date : 25-9-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# రేపు కూడా పలు జిల్లాల్లో వర్షాలు

## నదులకు వస్తున్న ప్రవాహాలు, యంత్రాంగం సన్నద్ధం పై సీఎం చర్చ

- సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లను నింపాలని సూచన
- జన జీవనానికి ఇబ్బంది రాకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు.






**గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి..** ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు--వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌కు 21,200--26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000--7,500 క్యూసెక్కులు, మేఘాద్రిగడ్డకు 2,400--3,000 క్యూసెక్కులు, పంపాకు 3,100--3,875 క్యూసెక్కులు వరకు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి--వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరిచారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 25 ఉదయం నాటికి వార్నింగ్ లెవల్--1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్--1, అదే రోజు రాత్రికి వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం వార్నింగ్ లెవల్--1, సాయం త్రం వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబర్ 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**ప్రకృతి వ్యవసాయం చేయాలి... భూసారాన్ని పెంచాలి..** ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు.

# పెద్ద కలలు కనండి.. లక్ష్యాలను సాధించండి

- పరిస్థితులు ప్రతిభకు అడ్డంకులు కావు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- 632 మంది ఎస్సెస్సీ టాపర్లకు రూ.2.27 కోట్ల ప్రోత్సాహకాలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** పదో తరగతి ఫలితాలు జీవితానికి ముగింపు కాదని.. ఉన్నత లక్ష్యాల వైపు సాగేందుకు తొలి అడుగు మాత్రమేనని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. విద్యార్థులు పెద్ద కలలు కనాలని, కష్టపడి వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు, వనరుల కొరత అడ్డంకులు కావని స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్‌సిటీలోని శిల్పకళావేదికలో శ్రీరామ్ గ్రూప్ నిర్వహించిన 'మిషన్ 10వ తరగతి--రివార్డ్ అండ్ రికగ్నిషన్' కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 632 మంది ఎస్సెస్సీ టాపర్లకు సుమారు రూ.2.27 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తున్న శ్రీరామ్ గ్రూప్‌ను గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ "మీరు ఎక్కడి నుంచి వచ్చారో, ఎలాంటి పరిస్థితుల్లో పెరిగారో మీ కలలకు అది పరిమితి కాకూడదు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి తాను అనుకున్నది సాధించగలడు" అన్నారు. విద్యతోపాటు జిజ్ఞాస, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ చదవాలని, ప్రశ్నలు అడుగుతూ నిరంతరం నేర్చుకోవాలని చెప్పారు. తమ విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషిని విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోవద్దని గవర్నర్ సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత తమ పాఠశాలలకు, సమాజానికి తిరిగి సేవ చేయాలని ఆకాంక్షించారు. "పెద్ద కలలు కనండి.. కష్టపడి పనిచేయండి.. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణకు పేరు తీసుకురండి" అని విద్యార్థులకు గవర్నర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈవో, ఎండీ క్యాస్పర్స్ జె.హెచ్. క్రామ్‌హౌట్, శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వి.ఎన్. రెడ్డి, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఎంఓ డా. వరుణ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు

- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు సీఎం ఎంపిక
- కేరళ నిలంబూరులో అవార్డు ప్రదానోత్సవం
- రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు



**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ - 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026 (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరిం చారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రత్యేకంగా కొనియా డింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించు కుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంట లకు అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీని యర్ నేత. 8 సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగు సార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ఆర్యదాన్ ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్ గా, సమర్థుడైన పాలకునిగా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయితీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ఆర్యదాన్ ముహమ్మద్ గుర్తింపు పొందారు.

# ఏపిలో గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్ ఏర్పాటు చేయండి

## -గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామితో మంత్రి లోకేష్ భేటీ



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామితో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... గోద్రెజ్ అనుబంధ సంస్థల్లో ఒకటైన అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యాన ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయాలని కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల కోసం ఎపిలో ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించడానికి గోద్రెజ్ ఆగ్రోవెట్ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి స్పందిస్తూ... గోద్రెజ్ ఉ బాయిస్ గృహోపకరణాలు, ఇంటెరియో ఫర్నిచర్, తాళాలు, పారిశ్రామిక పరికరాల తయారీ, ఇస్రో/డిఆర్‌డిఓ ఏరోస్పేస్ విడి భాగాల తయారీ రంగంలో సేవలందిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నాం, ఇంటిరియో ద్వారా 2లక్షల చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పెట్‌కేర్ శ్రేణి , రుణాల కోసం గోద్రెజ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ను కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్ గా ఉందని అన్నారు. గత ఏడాది నవంబర్ లో ఆంధ్రప్రదేశ్ లో గోద్రెజ్ ఆగ్రోవెట్, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్ల విలువైన ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేసినట్లు చెప్పారు. ద్వారకా తిరుమల మండలంలో రూ. 210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ ప్రత్యామ్నాయ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎపి ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని రాకేష్ స్వామి చెప్పారు.

# బీసీ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడాలి - మంత్రి సవిత ఆదేశం

**అమరావతి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా హాస్టళ్లు, గురుకులాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే మెరుగైన విద్యమందించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణకు మంత్రి సవిత కీలక ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ, విద్యార్థుల యోగా క్షేమాలను గమనిస్తూ ఉండాలన్నారు. వేడి, తాజా ఆహారం మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. బయట ఆహారాన్ని లోపలికి రానివ్వొద్దని, కాచి చల్లార్చిన నీటి మాత్రమే అందివ్వాలని తెలిపారు. హాస్టళ్లు, గురుకులాల చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వ్యాధులు ప్రబలక ముందే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురి కాగానే సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. పాత భవనాల్లో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనాల్లోకి తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని బీసీ కార్పొరేషన్ చైర్మన్లకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. కూటమిలోని పార్టీలు, నాయకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టంచేశారు. రెండేళ్ల సీఎం చంద్రబాబునాయుడు పాలనలో బీసీల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని మంత్రి సవిత ఆదేశించారు.

## వేలం ప్రకటన

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్ ) వారి కోర్టులో**

E. P. No. 139 / 2024 in O.S.No.13 / 2020

Between:

జెట్టి వెంకటలక్ష్మి ------D. Hr

మరియు

బొర్రా రాజాబాబు ------J. Dr

పై నెంబరు డిక్రీబాకీని రాబట్టుకునే నిమిత్తం J. Dr యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో గల యీదిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి యెదుట ది. 12-10-2026న ఉదయం గం. 10.30ని. ల నుండి వేలం వేయబడును. కావున పాడు కొనదలచిన వారు సదరు వేలం పాటలో పాల్గొని వేలం షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును.

**షెడ్యూలు :**

కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా మచిలీపట్నం టౌన్, బందరుకోట లోని మున్సిపల్ వార్డు నెం. 31, డోర్ నెం. 31/47-2రుకు చెందిన చ. గ. 210లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు :

**1వ ప్రతి :** చ. గ. 168.55ల స్టిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు : తూర్పు :** 2వ ప్రతి కొంత, పుట్టి పున్నయ్య గారి ప్రహరీగోడ, స్థలము అ. 37లు, **దక్షిణం :** బొర్రా శేషుబాబు వగైరాల ప్రహరీ గోడ, స్థలము అ. 41లు, **పడమర :** బొర్రా కిషోర్ గారి స్థలము అ. 37లు, **ఉత్తరం :** బి -పార్టీ (బొర్రా రాజాబాబు) వారి స్థలము అ. 41లు యీ హద్దుల మధ్య చ. గ. 168.55లు లేక చ. మీ. 140.16ర్ల స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము.

**2వప్రతి :** చ. గ. 41.45ల దారి స్థలమునకు **హద్దులు : తూర్పు :** మున్సిపల్ రోడ్డు అ. 9.8లు, **దక్షిణం :** పుట్టి పున్నయ్య గారి ప్రహరీ గోడ, స్థలము అ. 49.6లు, **పడమర :** పై 1వప్రతి అ. 5.6లు , **ఉత్తరం :** పుట్టి వీరవెంకటేశ్వరరావు గారి బిల్డింగ్, స్థలము కొంత, బి -పార్టీ (బొర్రా రాజాబాబు)వారి స్థలము కొంత అ. 49.6లు. యీ హద్దుల మధ్య చ. గ. 41.45లు లేక చ. మీ. 34.46ర్ల స్థిరాస్తి ఖాళీ నివేశనస్థలము.. పై 1,2ప్రతులు వెరశి చ. గ. 210లు లేక చ. మీ. 175.58ర్ల స్థిరాస్తి ఖాళీ నీవేశనస్థలము.

D. Hr కిమ్మత్తు :రూ.6,61,150/-లు.
అమీనా కిమ్మత్తు :రూ. 7,50,000/-లు
మార్కెట్ విలువ :రూ. 8,40,000/-లు

NOTE:- E.C. దాఖలా అన్యా క్రాంతములు ఏమియున్నూ లేవు.

**(శ్రీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం)**

**A.సత్య నారాయణ, సంకుల ప్రియసుధ**
D. Hr **తరుపున న్యాయవాదులు, మచిలీపట్నం**

# దుండు మన్మోహన్ కు "సీనియర్"అడ్వకేట్ హోదా

**హైదరాబాద్,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** తెలుగు రాష్ట్రాలలోని హైకోర్టులలో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ దుండు మన్మోహన్ కు "డెజిగ్నేటెడ్ సీనియర్" హోదా ఇస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 1981 లో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు హైదరాబాద్ లో అడ్వకేట్ గా ప్రాక్టీస్ ప్రారంభించిన మన్మోహన్ 1993లో ఇన్కమ్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జ్యూడిషియల్ మెంబర్ గా ఎంపికైనారు. కలకత్తా జోన్ లో జాయిన్ అయ్యిన వీరు బాంబే, హైదరాబాద్, విశాఖ లలో పనిచేశారు. 2008లో ఇన్కమ్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ వైస్ ప్రెసిడెంట్ గా నియమించబడి చండీగర్, లక్నో, ముంబాయి, హైదరాబాద్ లతో పాటు 2018 వరకు దేశంలోని అన్ని జోన్లలో పనిచేసిన అరుదైన అవకాశం పొందారు. వృత్తి పరంగా నిజాయితీ, ముక్కు సూటితత్వం ఉన్న వ్యక్తిగా పేరుగాంచారు. తెలుగు రాష్ట్రాలలోని హైదరాబాద్ లో, విశాఖపట్నంలో ఇన్కమ్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ కార్యాలయాల నిర్మాణంలో మన్మోహన్ క్రియాశీలకంగా వ్యవహరించారు. ఇన్కమ్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ వైస్ చైర్మన్ గా మన్మోహన్ రిటైర్మెంట్ తర్వాత హైదరాబాద్ లోని తెలంగాణ హైకోర్టు మరియు అమరావతి లోని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టులలో తిరిగి ప్రాక్టీస్ ప్రారంభించారు. పలు విభాగాల కేసులతోపాటు ప్రత్యేకంగా ఇన్కమ్ టాక్స్ కేసులలో నిష్ణాతులైన మన్మోహన్ విశాఖపట్నంకు చెందిన రైల్వే సీనియర్ మాజీ ఉద్యోగి దుండు జగన్నాధరావు మరియు శ్రీమతి రత్నం దంపతుల కుమారుడు. బిఎల్ మరియు ఎం.కామ్. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ లో పూర్తి చేశారు.బాంబే యూనివర్సిటీలో ఎల్.ఎల్.ఎం. చేసిన వీరు, యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకర్ గా నిలిచారు. తెలుగు రాష్ట్రాలలో రెండు లక్షల పైగా న్యాయవాదులు ఉంటే 150 మంది వరకు సీనియర్ హోదాను హైకోర్టు కల్పించింది.మన్మోహన్ తో పాటు మంత్రి రామారావు ఏకే జయ ప్రకాష్ రావు, ఎం రాజేందర్ రెడ్డి, ఏర బాటి రామారావు, కల్పన, ఏ ప్రభాకర్ రావు, వై రత్నాకర్, కే రాఘవాచార్యులు, జీవి ప్రసాద్, ఈ ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్ వెలగపూడి, డాక్టర్ జుట్టు కొండ విజయలక్ష్మి, చెట్లూరు శ్రీనివాస్, వీవీఎస్ఎన్ రాజు, టీఎస్ రాజశేఖర్, రమేష్ బాబు విశ్వనాధుల, థామస్ జార్జ్, చిక్కుడు ప్రభాకర్, పి విష్ణువర్ధన్ రెడ్డి, వివేక్ జైన్ లు "సీనియర్" అడ్వకేట్ హోదా పొందిన వారిలో ఉన్నారు. సెప్టెంబర్ 16న తెలంగాణ ఫుల్ కోర్ట్ సమావేశంలో గౌరవ ప్రధాన న్యాయమూర్తి మరియు గౌరవ న్యాయమూర్తులు వీరికి ఈ హోదా ఇవ్వాలని నిర్ణయించారు. ఆ రోజు నుంచి వీరి హోదా అమల్లోకి వచ్చింది.




# స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు



**తాడేపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు.

## “వార్తా ప్రభ” కథనానికి స్పందన..

# డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

● జేసీబీతో డ్రైనేజీ శుభ్రం చేసిన ఎంపీడీవో అబ్దుల్ సలాం



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి--నూజివీడు ప్రధాన రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయి చెరువులను తలపిస్తున్న పరిస్థితిపై “వార్తా ప్రభ” దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నం కళ్యాణ మండపం సమీపంలో నిలిచిపోయిన వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ఎంపీడీవో ఎస్.కే. అబ్దుల్ సలాం జేసీబీ సహాయంతో గురువారం డ్రైనేజీలను శుభ్రం చేయించారు. డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగించడంతో వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం సుగమమైంది. దీంతో వాహనదారులు, బాటసారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగాయి. సమస్యపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన ఎంపీడీవో అబ్దుల్ సలాంకు స్థానికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# అలసత్వం వద్దు అప్రమత్తంగా ఉండండి

● ప్రమాదకర ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయండి

● భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**జి.కొండూరు,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అలసత్వం లేకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ జి.కొండూరు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. హెచ్. ముత్యాలంపాడు వద్ద బుడమేరు పై ఉన్న వంతెన, వెలగలేరు తదితర ప్రాంతాలను క్షేత్రస్థా యిలో సందర్శిం చారు. వాగులు,వంకలు, వంతెన లు,చెరువులు,ఇతర జలవనరుల వద్ద పరిస్థితు లను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. వాగులు, వంకల్లో నీటి ప్రవాహం, వంతెనల స్థితిగతులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగిన సందర్భాల్లో ప్రజలు వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించా రు. వంతెనలు, కల్వర్టులు, రహదారుల వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం గమనించాలని, ఎక్కడైనా రాకపోకలకు ఇబ్బంది లేదా ప్రమాదకర పరిస్థితి ఏర్పడే అవకాశముంటే వెంటనే సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలు, వాగులు, వంకల పరిస్థితిని స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజల ప్రాణ భద్రతే అత్యంత ప్రాధాన్యతగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, వర్షాల పరిస్థితిని నిరంతరం అంచనా వేస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా సమర్థవంతం గా ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు.

# అధిక వర్షాలలో మిరప పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

-ఉద్యాన అధికారి మహేష్



**మైలవరం,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** అధిక వర్షాలలో మిరప పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని మైలవరం మండల ఉద్యాన అధికారి మహేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధిక వర్షాల నేపథ్యంలో మిరప తోటలలో నీరు నిల్వ ఉంటే వేళ్ళు కుళ్ళిపోవడం జరుగుతుంద ని అదనపు నీటిని బయటకు పంపించడానికి బోదెలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మొక్కలుకు మట్టి ఎగదోసి బలం చేకూర్చాలని తెలిపారు. వాతావరణం అనుకూ లించిన తరువాత లీటరు నీటికి 10 గ్రాముల మల్టీ -కె లేదా 19.19.19 పోషకాన్ని పిచికారి చేయులని రైతులకు సూచించారు. దీనివలన మొక్కలు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంద ని వెల్లడించారు. అధిక నీటి వలన వేరుకుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంది కాబట్టి వేరు కుళ్ళు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా లేదా శాఫ్ 2 గ్రాముల లీటరు నీటికి కలిపి యొక్కల మొదళ్ళలో పోయాలని తెలియజేశారు.

## మండల ప్రత్యేక అధికారిణిగా చార్జి తీసుకున్న చక్రాణి



**విస్సన్నపేట,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఎంపీపీ పదవీకాలం ముగిసిపోవడంతో మండల ప్రత్యేక అధికారిణి చక్రాణి చార్జి తీసుకున్నారు. అందుబాటులో ఉంటానని త్వరితగతిన ప్రజా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు, డిప్యూటీ ఎంపీడీవోలు శివకుమార్ రామ్మోహన్ తదితరులు సాదరంగా ఆహ్వానించారు.

# ప్రాణదాతలకు వందనం

**శ్రీకాకుళం,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఏపీ ఎంపానెల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ పత్రికల్లో ప్రకటనల కోసం, వాటి బిల్లుల చెల్లింపుల కోసం మాత్రమే పోరాడుతుందనే సంప్రదాయాన్ని బద్దలుగొట్టింది. తమ యూనియన్ లో సభ్యుడిగా ఉన్న ఒక మిత్రుడికి ప్రాణదానం కోసం ఒక్కటిగా కదిలివచ్చి మంత్రి లోకేష్ కార్యాలయాన్ని కదిలించిన అంశం జర్నలిస్టుల ప్రయాణంలోనే ఓ కీలక మలుపు. సాధారణంగా బాధితుల తరఫున జర్నలిస్టులు కథనాలు రాస్తారు. అటువంటి జర్నలిస్టు ప్రాణాపాయంలో ఉంటే ఎవరు స్పందిస్తారు? ఎవరి విషయం ఏమో గానీ ఎంపానెల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ మాత్రం స్పందించింది. శ్రీకాకుళం నుంచి వెలువడుతున్న కళింగసీమ పత్రిక ఎడిటర్ పైలా శ్రీను లివర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆస్తులన్నీ అమ్ముకున్నా టెస్టులకు కూడా సరిపోలేదు. ఇప్పుడు లివర్ డోనర్ దొరికేసరికి ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేకుండా పోయింది. దీన్ని తెలుసుకున్న ఎంపానెల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ శ్రీనుకు ఆర్థిక సాయం కోసం బుధవారం రాత్రి గ్రూపులో ఒక సందేశం పెట్టింది. దీనికి స్పందించి ఎంపానెల్డ్ పత్రికల యాజమాన్యాలు వారికి తోచిన రీతిలో ఆర్థిక సాయాన్ని అందించారు. ఇది ఇక్కడితో ఆగిపోకూడదని, పైలా శ్రీనివాసరావును బతికించుకోవాలన్న తపనతో యూనియన్ నాయకులు గురువారం మంత్రి లోకేష్ గారి తలుపు తట్టారు. శ్రీనివాస్ పరిస్థితిని వివరించారు. అక్కడికి కొద్ది గంటల వ్యవధిలోనే మంత్రి లోకేష్ గారి కార్యాలయం నుంచి పైలా శ్రీనివాసరావుకు ఫోన్ వచ్చింది. శ్రీకాకుళం నుంచి ఎల్.ఓ.సీని లోకేష్ గారికి పంపిస్తే, వెంటనే లివర్ మార్పిడికి అవసరమైన సహాయం చేస్తామని తెలిపారు. దీంతో శ్రీనివాస్ బతుకు మీద ఆశలు చిగురించినట్లయింది. తన కోసం ఇంత చేసిన యూనియన్ నాయకులకు శ్రీనివాస్ కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు.

# ముందస్తు చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే పంతం నానాజీ

● క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఎమ్మెల్యే





**కాకినాడ రూరల్,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** “అర్నబ్” తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కురుస్తున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులకు సూచించారు. గురువారం రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని పేట కాలువలోని నీరు కిందకు దిగకపోవడంతో, దిగువన ఉన్న తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని అవంతి నగర్ కాలనీ ముంపునకు గురికాకుండా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తక్షణ ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించి, వెనువెంటనే జేసీబీలతో పనులను ప్రారంభించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని నీటి సంఘం ప్రెసిడెంట్,సొసైటీ సభ్యులు కూడా తక్షణమే తమ పరిధిలోని కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. స్థానిక నాయకులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో వాసుదేవరావు, ఎంపీడీవో పి.సతీష్, ఇవోపీఆర్డి రామాంజనేయులు, కూటమి నాయకులు బుర్ర అను బాబు, తాటికాయల వీరబాబు (బుజ్జి), మదారపు తాతాజీ, మేకా లక్ష్మణ్ మూర్తి,కర్రి వెంకట్రాజు,కుడుపూడి బాలాజీ, బత్తుల దొరబాబు, రామిశెట్టి సునీల్,తోటకూర సతీష్,తురగ సంతోష్,కాళ్ళ శ్రీనివాస్,గిడుతూరి శ్రీనివాస్, రాయుడు అనిల్,పంపన మహేష్, పాలిక వాసు, ముద్దుర్తి రోహిత్ కుమార్,పాలిక అరవింద్,చంటి రెడ్డి, చోడిశెట్టి ఇంద్ర, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆటోమొబైల్ యూనియన్ భారీ మహా గణపతి ఊరేగింపు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఆటోమొబైల్ యూనియన్ మహాగణపతి విగ్రహాన్ని భారీ ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆటోమొబైల్ రంగంలో ఉన్న అన్ని రంగాల వర్కర్స్ హెల్పర్స్ మరియు యజమానులు పాల్గొన్నారు. యువత వినాయక చవితిని సైతం హోలీని తలపించేలా రంగురంగులతో సంబరాలు జరుపుకున్నారు.

## మండలంలో వాగులు ఉద్ధృతిపై అధికారుల పర్యవేక్షణ

● భారీగా వస్తున్న వరదనీరు.. అప్రమత్తమైన అధికారులు





**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండలం నూగోండపల్లి సమీపంలో కుంపిని వాగు, వడ్లమాను గ్రామ పరిధిలో వాగు, చిన్న ఆగిరిపల్లి, తోటపల్లి ప్రధాన రహదారి రాకపోకలు నిలిపీతం జరిగిందని, వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. వడ్లమాను కొండలు, పొలాల నుంచి భారీగా వరదనీరు వాగులోకి చేరడంతో నీటి ప్రవాహం ప్రమాదకరంగా మారింది. పరిస్థితిని ఆగిరిపల్లి మండల రెవెన్యూ అధికారి, పి ఎస్ ఎన్ వి ప్రసాద్, ఎంపీడీవో ఎస్ కే అబ్దుల్ సలాం,ఆగిరిపల్లి ఎస్సై నాగరాజు పరిశీలించి పర్యవేక్షించారు. వాగు ప్రవాహ పరిస్థితులను అధికారులు దగ్గరుండి పరిశీలిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగు వద్దకు వెళ్లకుండా, ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# చిన్నారుల భక్తికి పెద్దల సహకారం!

● తొమ్మిది రోజుల పాటు గణపతి పూజలు.. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

**సామర్లకోట,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** వయసు చిన్నదైనా భక్తిలో మాత్రం పెద్ద మనసు చాటుకున్నారు సామర్లకోట మండలం పండ్రవాడ జంక్షన్‌కు చెందిన చిన్నారులు. 10 నుంచి 15 ఏళ్ల వయసున్న పిల్లలు ఏకమై తమ కాలనీలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గణపతిని ప్రతిష్ఠించాలన్న ఆలోచనతో కాలనీలోని ప్రజలను సంప్రదించిన చిన్నారులు చందాల రూపంలో విరాళాలు సేకరించారు. వారి భక్తి, పట్టుదలను గమనించిన పెంకే అన్నవరం తన ఇంటి వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఉత్సాహంగా గణపతి విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించిన చిన్నారులు తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూజలు, భజనలు నిర్వహించారు. పూజలకు హాజరైన భక్తులకు ప్రతిరోజూ ప్రసాదాలు పంపిణీ చేశారు. చిన్నారుల ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమానికి కాలనీ ప్రజలు కూడా సహకరించడంతో తొమ్మిది రోజుల పాటు ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజలు ముగియడంతో మంగళవారం గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు



భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఊరేగింపులో పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. చిన్న వయసులోనే భక్తితో ముందుకొచ్చి, ఐక్యంగా కార్యక్రమాన్ని నిర్వహించిన చిన్నారులను స్థానికులు అభినందించారు. ప్రభాస్, పార్థు, వర్ధన్, బాలాజీ, హర్ష, సాత్విక్, కోటి, భార్గవ్, చరణ్, కన్నా, సెల్వమని, మోషీత్, యోగి, గుత్తుర్తి శ్రీను, పెంకే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితిని అంచనా వేస్తున్న అధికారులు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజల ఇబ్బంది పడకుండా వాగులు చెరువులు కాలువలను మండల అధికారులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి, ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు, ఎస్ ఐ అర్జున రాజు పాల్గొన్నారు. ఎనీ టైం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.

# 650 ఎకరాల్లో వరి పంట నీట మునక-ఏవో సుధా మాధురి

● రామకృష్ణాపురం,చిల్లంగి,కిర్లంపూడి గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ఏవో..

● ముంపు పొలాల్లో నీటిని త్వరగా బయటకు తీయాలని రైతులకు సూచన



**కిర్లంపూడి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** తుఫాన్ ప్రభావంతో కిర్లంపూడి మండలంలో నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. గురువారం మండలంలోని రామకృష్ణాపురం, చిల్లంగి,కిర్లంపూడి గ్రామాల్లో వ్యవసాయ అధికారిణి నాగం సుధామాధురి పర్యటించి ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో సుధా మాధురి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మండలంలో సుమారు 650 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. పంటను ముంపు ప్రభావం నుంచి కాపాడుకునేందుకు రైతులు పొలాల్లో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు తీయాలని సూచించారు. ఇందుకోసం పిల్ల కాలువలు ఏర్పాటు చేసుకోవాలని,అవసరమైన చోట ఆయిల్ ఇంజిన్లను ఉపయోగించి నీటిని బయటకు తోడాలని తెలిపారు. వర్ష ప్రభావం తగ్గిన వెంటనే వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 200 గ్రాములు,కాపర్ ఆక్సీక్లోరైడ్ 400 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఏఈఓ ఎన్. సీతారామమూర్తి,వీఏఏ పార్వతి పాల్గొన్నారు.

# టీడీపీ సీనియర్ నాయకుడికి టీడీ జనార్దన్ పరామర్శ



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** అనారోగ్యంతో విజయ-ంవాడలోని ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సోసైటీ మాజీ అధ్యక్షులు ఉమ్మినేని నరసింహారావు ని జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లీటరేచర్ కమిటీ చైర్మన్ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు గారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులు, నాయకులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా కల్పించారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తున్న సీనియర్ నాయకుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం తమ బాధ్యత అని టీడీ జనార్దన్ పేర్కొన్నారు. అలాగే ఆయన కుమార్డు ముళ్లపాడు సోసైటీ అధ్యక్షులు ఉమ్మినేని పుల్లయ్య బాబు కు ధర్యంగా ఉంటూ మీ నాన్న ఆరోగ్యం మెరుగు పడే వరకు జాగ్రత్తగా ఉండమని తెలిపారు..

## పెడన మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



**పెడన,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ప్రస్తుతం మండలంలో నెల కొన్నఅనావృష్టి పరిస్థితులు దృష్టి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ప్రముఖ రైతు వన్నెంరెడ్డి మహంకాలరావు అన్నారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల మండలంలోఅధికారిక లెక్కల ప్రకారం 12 వేల ఎకరాల పంట నష్టం జరిగిందన్నారు. కేవలం 14 వేల ఎకరాలు మాత్రమే సాగు జరిగిందని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు సహకరించి కరువు మండలం గా ప్రకటించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# జోరువాన.. జోరుగా పారిశుద్ధ్య పనులు

**గన్నవరం,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** గన్నవరం మండలం కేసరపల్లి శివారు వీఎన్ పురం కాలనీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. డ్రైన్లలో, రహదారులపై అక్కడక్కడ నీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది వర్షపు నీటిని తొలగించి, డ్రైన్ల ద్వారా నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ సిబ్బంది వెనుకడుగు వేయకుండా పనుల్లో నిమగ్నమై కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూశారు. వర్షాల సమయంలో పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడకుండా పంచాయతీ కార్యనిర్వాహక అధికారి ప్రసాద్



సిబ్బందికి రైన్‌కోట్లు పంపిణీ చేశారు. వర్షం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలందిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని అధికారులు తెలిపారు.

## పేదలకు సత్యనారాయణ ఆపన్నహస్తం





మల్కాజ్ గిరి సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం.. సేవా కార్యక్రమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు మల్కాజ్గిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ లోని జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్‌కు చెందిన సిద్ధమ్మ, సత్యనారాయణ. రాజకీయాలతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యమిస్తూ పేదలు, విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తన వంతు సహకారం అందిస్తున్నారు.

**విద్యార్థులకు చేయూత** ఇటీవల తన స్వగ్రామమైన చందాయిపేటలో పి వి కే కన్స్ట్రక్షన్ పేరుతో సుమారు రూ.2 లక్షల సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఆటపరికరాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సత్యనారాయణ తెలిపారు.

**మల్కాజ్ గిరి లోను సేవా కార్యక్రమాలు** ఇదే కాకుండా మల్కాజిగిరి, గౌతమ్‌నగర్ తదితర ప్రాంతాల్లోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఆలయాల అభివృద్ధికి సహకరించడంతో పాటు పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. అనూహ్యంగా కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సైతం తనవంతుగా ఆర్థిక సహాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అనుచరుడిగా రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. రాజకీయాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న ఆయనను పలువురు అభినందిస్తున్నారు.

## పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి జరుగుతుంది

**- మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి.**




శేరిలింగంపల్లి,సెప్టెంబరు 24 (వార్తాప్రభ):ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపిన మహిళను బెదిరించడం, వేధించడం సరికాదని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు.రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేయాలని సూచించారు. బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని, తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు.నల్లగండ్ల హుడా కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తైన నేపథ్యంలో ఉమా సఫైర్ హైట్స్‌కు చెందిన ప్రసన్నకుమారి వాట్సాప్ గ్రూపులో అభివృద్ధి పనులకు కృతజ్ఞతలు తెలిపారని గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిపై కొందరు కాలనీ,రాజకీయ నాయకులు ఆమెను వేధిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు.కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఎమ్మెల్యే సహకారంతో గచ్చిబౌలి డివిజన్‌లో రహదారులు,డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు.పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ వ్యవహారాన్ని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తానన్నారు. కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, నల్లగండ్ల డివిజన్ అధ్యక్షుడు కిషన్ గోలి, నాయకులు లక్ష్మణ్, శేఖర్, రాకేష్, అనుష్మాన్ మిశ్రా, రంజిత్ పూరి, దొరబాబు, మహేష్, ప్రసన్నకుమారి, ఉదయలక్ష్మి, శ్రీలక్ష్మి, హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

## అవసరం అయ్యిన చోట అదనపు బడ్జెట్ కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సిఎంసి కమిషనర్



శేరిలింగంపల్లి,సెప్టెంబరు 24 (వార్తాప్రభ):నల్లగండ్ల, పటేల్ చెరువుల వద్ద కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను సీఎంసీ కమిషనర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జోనల్ కమిషనర్, చీఫ్ ఇంజినీర్,డిప్యూటీ కమిషనర్లు,సంబంధిత అధికారులు వెంట ఉన్నారు. పనుల పురోగతిని సమీక్షించిన కమిషనర్.. మిస్సింగ్ లింకులు, కల్వర్టులు, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.పనులకు అడ్డంకిగా ఉన్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.అవసరమైన చోట అదనపు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# గ్రేటర్ హైదరాబాద్, జవహర్ నగర్ పిఓడబ్ల్యూ(విముక్తి) కన్వీనర్స్ గా తుమ్మరాణి, యమున గౌడ్ ల నియామకం

**- మహిళా కార్యకర్తల సమావేశంలో ప్రకటించిన ఆర్గనైజింగ్ సెక్రెటరీ గడిపే సునీత.**

**-పాల్గొన్న ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి.**




జవహర్ నగర్, సెప్టెంబర్ 24:(వార్తా ప్రభ)దేశవ్యాప్తంగా ముఖ్యంగా పీడిత వర్గాల మహిళలపై అమానుష, అమానవీయ, అసమానతాలు, అసహజత్వాలు, అన్యాయాలు, అత్యాచారాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, శారీరక, మానసిక హింసలు స్త్రీలపై ఎన్నడులేనంత గత 13 సంవత్సర కాలంలో తీవ్రమయ్యాయని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ఎన్ని చట్టాలు చేసిన అవి ఉన్నత వర్గాల ప్రయోజనాలు పరిరక్షించే చుట్టాలుగా, సామాన్య పేద, మధ్యతరగతి స్త్రీలకు తగిన రక్షణ, భద్రతను కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఎత్తిచూపారు. 2026, సెప్టెంబర్-24, గురువారం రోజు, కీసరసర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోగల ధళిత సంక్షేమం భవనంలో సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ సంస్థ ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ-విముక్తి) గ్రేటర్ హైదరాబాద్ మహిళా కార్యకర్తల సమావేశం ఆ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ గడిపే సునీత ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న షేక్ షావలి 79 ఏళ్ళ స్వతంత్ర భారతదేశంలో శ్రామిక మహిళల స్వేచ్ఛను, స్వతంత్రను, అభివృద్ధిని గుర్తించలేక పోతున్నారని పేర్కొన్నారు. నేటికి అన్నిరకాల దోపిడీ, పీడన, అణిచివేతలతో పాటుగా రెండవ తరగతి శ్రేణిగా, బానిసగా మార్చే సంస్కృతిని పెంచి పోషిస్తున్నారని గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న అర్థవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ కలిగిన భారతదేశం లాంటి దేశాలలో నేడు సాంకేతికంగా ఎంత అభివృద్ధిని సాధించిన కుల, మతోన్మాదులు మూడ అంధవిశ్వాలను పెంచి, వారి చైతన్యాన్ని మొద్దు బారిస్తున్నారని ఆరోపించారు. తద్వారా తమ విధానాలను వ్యతిరేకించే మహిళలపై అన్నిరకాల హింసలకు గురిచేస్తారని అన్నారు. వారి హక్కుల సాధనకై ఉద్యమించే మహిళా కార్యకర్తలు, నాయకులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులు అకారణంగా తప్పుడు కేసులకు గురిచేసి, ఎళ్ళ తరబడి ఎలాంటి విచారణలు లేకుండా జైళ్ళల్లో నిర్భందిస్తున్నారని అన్నారు. ప్రతి మహిళా మనిషిని మనిషిగా గుర్తించే సమసమాజ స్థాపనకు జరిగే వర్గ పోరాటాలలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం ద్వారానే అన్నివర్గాల మహిళలకు సంపూర్ణ విముక్తి సాధ్యం అని గుర్తించి, తమపై జరిగే అన్నిరకాల వేధింపులకు వ్యతిరేకంగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని, సమాజంలో మహిళల అంటే చులకన భావాన్ని ప్రదర్శించే పురుషాధిక్యత సంస్కృతి, భావజాలానికి వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమిస్తే తప్ప, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంఘీక సమానత్వాన్ని సాధించలేమని షేక్ షావలి మహిళా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ పిఓడబ్ల్యూ(విముక్తి) కన్వీనర్ గా తుమ్మ రాణి, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ కన్వీనర్ గా యమునా గౌడ్ లను నియమిస్తున్నట్లుగా గడిపే సునిత ప్రకటించారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా ఎత్తివేయాలని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# సీఎంఆర్ ధాన్యం పక్కదారి?

**● మిల్లర్ల తీరుపై అనుమానాలు.. తనిఖీ చేశారట? ● అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ) సుజాతనగర్:ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం పక్కదారి పట్టిందన్న ఆరోపణలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ లో చర్చనీయాంశంగా మారాయి. ధాన్యం సేకరణ సమయంలో మిల్లులకు తరలించిన వడ్లలో కొంతమేర లెక్కల్లో కనిపించకపోవడం, నిర్ణీత గడువులో సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు అప్పగించి, మిల్లింగ్ అనంతరం నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. అయితే సుజాతనగర్ కొన్ని మిల్లుల్లో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ వివరాలు, ప్రభుత్వానికి అందించిన సీఎంఆర్ పరిమాణంపై స్పష్టత అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ధాన్యం పక్కదారి పట్టిందన్న ఆరోపణలు నిజమా? ఎంత పరిమాణంలో ధాన్యం లేదా బియ్యం లెక్కల్లో తేడా ఉంది? దీనికి బాధ్యులు ఎవరు? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. గోదాముల నిల్వలు, మిల్లుల రికార్డులు, రవాణా వివరాలు, సీఎంఆర్ అప్పగింతల రికార్డులను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. స్టేట్ అధికారులు ఈ మధ్యనే తనిఖీ చేశారట లెక్కల్లో తేడాలు ఉన్నాయట సరి చేశారా? సరిచూసుకొని వెళ్ళారా? త్వరలో తెలుస్తుంది

# 26 నుంచి అక్టోబర్ 4 వరకు అవర్ సేక్రెడ్ ప్లేస్ పూంపుహార్ "మెగా హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పో"

**-తమిళనాడు హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (పూంపుహార్) అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) సి. గోపికన్నన్**






హైదరాబాద్ సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ): తమిళనాడు హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సరోజినీదేవి రోడ్ లోని అవర్ సేక్రెడ్ ప్లేస్ (హిమాలయ వరల్డ్ పక్కన) పూంపుహార్ పేరుతో "మెగా హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పో" ప్రారంభం కానుంది.ఈ ఎక్స్‌పో ఈ నెల 26 నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు జరుగుతుందని తమిళనాడు హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (పూంపుహార్) అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) సి. గోపికన్నన్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో తమిళనాడు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నైపుణ్యం కలిగిన కళాకారులు తయారు చేసిన అనేక రకాల అద్భుతమైన హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శన ద్వారా తమిళనాడు వైవిధ్యమైన సాంప్రదాయ హస్తకళా వారసత్వాన్ని ప్రజలకు పరిచయం చేయడం జరుగుతుందని వివరించారు.తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థ అయిన తమిళనాడు హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ "పూంపుహార్" పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రదర్శనలో కాంస్య విగ్రహాలు, ఇత్తడి సంప్రదాయ దీపాలు, తంజావూరు చిత్రాలు, తంజావూరు ఆర్ట్ ప్లేట్లు, పేపియర్-మాచే బొమ్మలు, చెక్క శిల్పాలు, రాతి శిల్పాలు, ఇత్తడి కళాఖండాలు, మట్టి , టెర్రకోట ఉత్పత్తులు, చెరకు/కేన్ ఫర్నిచర్, అరటి నార ఉత్పత్తులు, జనపనార (జ్యూట్) ఉత్పత్తులు, తాటి ఆకుల ఉత్పత్తులు, ఫ్యాషన్ ఆభరణాలు, ధూప ద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలు, చేతితో తయారు చేసిన వస్త్రాలు , చేనేత ఉత్పత్తులు, తదితర అనేక సాంప్రదాయ హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తమిళనాడు హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ (సేల్స్) సి. గోపికన్నన్ వివరించారు.

# జీడిమెట్లలో బాంబ్ డిస్పోజల్ బృందం ముమ్మర తనిఖీలు

**బేబీ పాండ్స్, వినాయక మండపాల వద్ద యాంటీ సబోటేజ్ చెకింగ్**

**భద్రతపై నిరంతర నిఘా ఉంచిన పోలీసులు**





జీడిమెట్ల, సెప్టెంబర్ 24, (వార్తాప్రభ) : గణేష్ నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జీడిమెట్ల పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బేబీ పాండ్స్ (నిమజ్జన కొలనులు), భక్తులు భారీగా తరలివచ్చే ప్రధాన వినాయక మండపాల వద్ద బాంబ్ డిస్పోజల్ (బీడీ) బృందం విస్తృతంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు నిర్వహించింది. జీడిమెట్ల ఎస్ హెచ్ఓ కే. రవి కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, నిమజ్జన ప్రాంగణాలు, పరిసర ప్రదేశాలను మెటల్ డిటెక్టర్లు, అధునాతన భద్రతా పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో ముగిసేలా పోలీసు యంత్రాంగం అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందని అధికారులు స్పష్టం చేశారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వాలంటీర్లకు యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "గౌరవ వేతనాలు"



పెద్దపల్లి, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ) పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లకు యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌరవ వేతనాలు అందజేశారు.ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న వాలంటీర్లకు ఒక్కొక్కరికి ?4,500/- చొప్పున గౌరవ వేతనం అందజేసినట్లు యాదవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కోశాధికారి తెలిపారు.ఈ సందర్భంగా యాదవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా. మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవలందిస్తున్న వాలంటీర్ల సేవలు అభినందనీయమని అన్నారు. సమాజంలోని అవసరమైన వారికి సహాయం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా తోడ్పాటు అందించడం ట్రస్ట్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు.యాదవ చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి డా. మేకల మల్లేశం యాదవ్ మాట్లాడుతూ, వాలంటీర్లు ఆసుపత్రిలో నిబద్ధతతో సేవలు అందిస్తున్నారని, వారి సేవలను ప్రోత్సహించేందుకు ట్రస్ట్ తరపున గౌరవ వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న స్వామి హుండీ ఆదాయం రూ. 4,73,575



మల్కాజ్ గిరి : సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)మల్కాజ్ గిరి ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో స్వామి వారికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను గురువారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారిగా అసిస్టెంట్ కమిషనర్ ఎ చంద్ర శేఖర్ సమక్షం లో లెక్కించగా 4,73,575 ( నాలుగు లక్షల డెబ్బై మూడు వేల ఐదువందల డెబ్బైఐదు రూపాయలు మాత్రమే) 70 రోజుల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి, ప్రధానార్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు, అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ మాజీ చైర్మన్లు ఉమేష్ సింగ్ రాందాస్ సంతోష్ రాజ్ ముదిరాజు అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాధి శంకర్ , హేమంత్ కుమార్, గణేష్ (కన్నా), సురేష్ సింగ్ , రవీందర్, మల్కాజ్ గిరి హెచ్ జీ యాదయ్య, భక్తులు రత్నమాల, రత్నమాణిక్యం, కె వి ఎస్ ప్రసాద్ , సూర్య కుమారి,ప్రభాకర్, ఎలియమ్మ,అరుణ, పద్మావతి,మీనాక్షి, వరలక్ష్మి,రాధమ్మ, గిరిధర్ రావ్, ప్రభావతి, శ్రీలక్ష్మి, రత్నా , సావిత్రి, గంగా, వి మీనాక్షి, శివాని,ధనలక్ష్మి, సుబ్బారావ్, మధుసూదన్ రావ్, తోట మంజుల, ప్రతిభ, తదితర భక్తులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 25 నుంచి "గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ 2026"




శేరిలింగంపల్లి,సెప్టెంబరు 24 (వార్తాప్రభ):మాదాపూర్ శిల్పారామంలో సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 4 వరకు 'గుజరాత్ హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఉత్సవ్ --2026' నిర్వహించనున్నారు .గుజరాత్ ప్రభుత్వ ఇండెక్స్-సి ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవంలో బంధనీ, పటోలా చీరలు, అజ్రక్ వస్త్రాలు, చెక్క బొమ్మలు, పూసల వస్తువులు, గృహోపకరణాలు తదితర హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించనున్నారు.కళాభిమానులు సందర్శించి గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.

## జ్ఞానసాయికి విశేషాభిషేకాలు...



గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ) మండలంలోని అంగలూరు జ్ఞానసాయికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం వేకువ జామునే ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగ మోహన్, లక్ష్మీ కుమారి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేషా భిషే కాలను చేపట్టారు. వర్షంలో సైతం సాయిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కేసులతో వైసీపీ నేతలు ఉక్కిరి బిక్కిరి !

వైసీపీ అధినాయకత్వం దూకుడు చేయమంటోంది. కూటమి ప్రభుత్వం మీద గట్టిగా పోరాటం చేయమంటోంది. దాంతో వైసీపీ నాయకులు క్యాడర్ అదే తీరున గట్టిగా రియాక్ట్ అవుతున్నారు. ఫలితం వరసబెట్టి కేసులు చుట్టుకుంటున్నాయి. ఇందులో ఏకంగా నాన్ బెయిల్ బుల్ కేసులు రౌడీ షీట్స్ ఓపెన్ చేసేలా కేసులు పెడుతూ కూటమి సర్కార్ తన పవర్ చూపిస్తోంది. ఈ పరిణామాలతో ఫ్యాన్ పార్టీలో తీవ్ర స్థాయిలో అంతర్మధనం కనిపిస్తోంది. నిరసనలు చేస్తుంటే కేసులు పడుతున్నాయి, ఇక సెక్షన్లు కూడా గట్టిగా పెడుతున్నారు, దాంతో ఒకటికి మించి వచ్చి పడుతున్న కేసులతో తట్టుకునేది ఎలా అన్న సందేహాలు కలవరాన్ని వ్యక్తం చేస్తున్నారు. మంచి రోజులు వస్తాయి వచ్చేది మన ప్రభుత్వమే అని వైసీపీ హైకమాండ్ ధీమాగా చెబుతోంది. కానీ ఒకవేళ అనుకోనిది జరిగితే మాత్రం తాము జీవిత పర్యంతం కేసులతోనే తిరగాల్సి ఉంటుందని కూడా వాపోతున్న వారూ ఉన్నారు. ఇక తాజాగా విజయవాడలోని శాప్ ఆఫీసు వద్దకు నిరసనగా వెళ్ళిన వైసీపీ నేతలలో యాభై మంది మీద రౌడీ షీట్ ఓపెన్ చేయాలని కూటమి సర్కార్ నిర్ణయించడం తీవ్ర కలవరం రేపుతోంది. శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘర్షణల నేపథ్యంలో వైసీపీ నాయకులు కార్యకర్తలపై పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. అక్కడ జరిగిన దాడికి సంబంధించి పోలీసులు వైసీపీ నేతలపై హత్యాయత్నం అలాగే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. అంతే కాదు వైసీపీ నేతలు అయిన దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం సహా మొత్తం 51 మంది వైసీపీ నేతలు అలాగే కార్యకర్తలపై రౌడీ షీట్లు తెరవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లను పోలీసు ఉన్నత స్థాయి అధికారులు ఆదేశించారు. అంతే కాకుండా గతంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితులుగా ఉన్న వారిపై కూడా ఈ రౌడీ షీట్లు ఓపెన్ చేయాలని పోలీసులు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇలా ఎందుకు అంటే శాప్ ఆఫీస్ వద్ద డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనల పేరిట వచ్చిన వారిలో పాత నేర చరిత్ర కలిగిన వారు అలాగే రౌడీ షీటర్లు ఉన్నారని సీసీటీవీ డ్రోన్ విజువల్స్ ఆధారంగా గుర్తించామని పోలీసులు పేర్కొంటున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే దీని మీద వైసీపీ నేతలు వాదన వేరే విధంగా ఉంది. డీఎస్సీ నియామకాలపై తాము చేస్తున్న న్యాయపరమైన పోరాటాన్ని ఉద్యమాన్ని అణగదొక్కడానికే కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా పాత కేసులను తెరపైకి తెచ్చి రౌడీ షీట్లు ఓపెన్ చేస్తోందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ శ్రేణులపైనే టీడీపీ వారే దాడులు చేశారని వారు వాదిస్తున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ప్రభుత్వం మీద ఆందోళన వరకూ ఓకే కానీ ప్రతీ సారీ కేసులు పెట్టించుకోవడం అవి కూడా పెద్ద సెక్షన్లతో నమోదు కావడం పట్ల చాలా మంది వైసీపీ నేతలు కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. నెమ్మదిగా తాము కేసుల వలలో చిక్కుకుని పోతున్నామని కూడా అంటున్నారు. ఇదిలా ఉంటే వైసీపీ నేతలు కార్యకర్తలు చేస్తున్న ఆందోళనలో వ్యూహం కూడా ఒక భాగంగా ఉండాలని అంటున్నారు. (

## హిందూ ధర్మ రక్షణ గ్రామ కన్వీనర్ లదే

### పొన్నపల్లి సత్యనారాయణ




**చెరుకుపల్లి మండలం సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి )** బాపట్ల జిల్లా ధార్మిక సమితి సమావేశం గూడవల్లి శ్రీరాం మందిర మండపంలో జరిగింది. గత నెలలో జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకుంటూ ఈ ఈ నెలలో జరగవలసిన కార్యక్రమాల ప్రణాళికను చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాపట్ల జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కులభేదాలు లేని హిందూహిందూ ధర్మ సమాజ నిర్మాణానికి సంత్ రవిదాస్, ముమ్మడివరం బాలయోగి లను ఆదర్శంగా తీసుకోవాలని అయన పిలుపునిచ్చారు. సమాజంలోని అట్టడుగుట్ట వర్గాల జన్మించి యోగులుగా మారి హిందూ ధర్మంలోనున్న రుగ్మతలను తొలగించి హిందూ ధర్మ అభివృద్ధికి జీవితాంతం కృషిచేసి యోగులుగా గురువులుగా అనేకమంది చేత పూజింపబడ్డారని తెలియజేశారు. హిందూ ధర్మ రక్షణకు గ్రామ ధార్మిక సమితిల ద్వారా కృషి చేయాలని తెలియజేశారు ఈ నెలలో సంవేదిత గ్రామాలలో గ్రామ ధార్మిక సమితి సందర్శనలు స్వామీజీ పర్యటనలు కోవాలని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి , జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, బొలగాని వెంకటేశ్వర్లు, కోట వాణిశ్రీ, కరి దుర్గాభవాని వేల్పూరి శ్రీనివాసరావు ధర్మ ప్రచారకులు ధర్మ విస్తారకులు మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో ఘనంగా నేషనల్ ఫౌండేషన్ డే




**చేజర్ల సెప్టెంబర్ 24 (వార్తాప్రభ)** మన ప్రభుత్వ జూనియర్ కళాశాల చేజర్ల నందు నేషనల్ ఫౌండేషన్ డే ను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కె.లక్ష్మి జ్ఞానేశ్వర్ అధ్యక్షతన ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్ శ్రీ ఏ చిరంజీవి చౌదరి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దశించి కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పటినుంచి పిల్లలు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని మానవసేవే మాధవసేవగా ప్రతి ఒక్కరు కూడా సేవా దృక్పథంతో పనిచేయాలని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఏ చిరంజీవి చౌదరి మాట్లాడుతూ పిల్లలు ఒక సేవా దృక్పథమే కాకుండా వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే ఒక మార్గంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు మరియు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు మిఠాయిలు పంచడం జరిగింది.

# వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు: కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా వేముల శ్యామలాదేవి రోడ్డు, 5వ నంబర్ రోడ్డు, మధు చౌక్, జమ్మిచెట్టు సెంటర్, సిద్ధార్థ కాలేజ్, మొగల్రాజపురం, మదర్ థెరిసా జంక్షన్, పెనమనేని పాలీక్లినిక్ రోడ్డు, పటమట, బందర్ రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడాన్ని గమనించిన కమిషనర్, వెంటనే గల్వర్లతో పాటు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఏపీఐఐసీ కాలనీలో నీటి నిల్వ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అక్కడి ప్రజలను ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే సురక్షితమైన పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటమట సోనోవిజన్ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ అక్కడ వర్షపు నీరు నిలిచిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 27 వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టినప్పటికీ, ప్రస్తుత వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రాంతాల్లో కూడా నీటి నిల్వలు ఏర్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. కేవలం తరచుగా వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపైనే దృష్టి పెట్టకుండా ప్రతి ఇంజనీర్ తమ పరిధిలోని అన్ని ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చోట్ల డీసిల్టింగ్ పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎక్కడా



అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా వర్షాలు కురిసిన సమయంలో నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని సూచించారు. నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.

ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులందరూ ఫీల్డ్‌లోనే ఉండాలి

- వర్షపు నీరు నిలిచిపోవడానికి కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలి
- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి)**భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన అధికారులందరూ ఫీల్డ్‌లోనే ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వర్షపు నీరు రహదారులపై ఎందుకు నిలిచిపోతుంది, అందుకు డీసిల్టింగ్ లోపమా, ఫ్లోటింగ్ ఆబ్జెక్ట్స్ కారణమా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకసారి నీటిని తొలగించిన ప్రాంతంలో మళ్లీ నీటి నిల్వలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం భారీ వర్షాల నేపథ్యంలో నగరంలోని కాళేశ్వరం మార్కెట్, వన్‌టౌన్ బ్రిడ్జి, సీతమ్మవారి పాదాలు, కనకదుర్గనగర్, కెనాల్ రోడ్, జెండాచెట్టు సెంటర్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, మ్యూజియం రోడ్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి వర్షపు నీటి ప్రవాహం, డ్రైనేజీ పరిస్థితులు, కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి వెంటనే నీటిని తొలగించాలని, డ్రైన్లు, కల్వర్టులు, అవుట్‌ఫాల్ డ్రైన్లలో నీటి ప్రవాహానికి




ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా అవసరమైన చోట్ల డీసిల్టింగ్ పనులు చేపట్టడంతో పాటు, నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త, వ్యర్థాలు, ఇతర వస్తువులను వెంటనే తొలగించాలని సూచించారు. బుడమేరు కల్వ మరియు ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటిమట్టం పెరుగుతున్న పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. నీటిమట్టం ఎంత మేర పెరుగుతోంది, పరిస్థితి ఎలా ఉంది అనే వివరాలను ప్రతి గంటకు నివేదిక రూపంలో సమర్పించాలని చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారిని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టం చేశారు.

# ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న సుప్రసిద్ధ హరికథా కళాకారుడు డా. ఎం. వి. సింహాచల శాస్త్రి

**శాస్త్రి కి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికిన ఈవో వి.కె. శీనా నాయక్**

**నేటి తరానికి మన సంస్కృతి, సనాతన సంప్రదాయాలను చేరువ చేస్తున్నారంటూ ప్రశంస**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుప్రసిద్ధ, అగ్రశ్రేణి హరికథా కళాకారుడు, డాక్టర్ ముప్పవరపు వేంకట సింహాచల శాస్త్రి (డా. ఎం. వి. సింహాచల శాస్త్రి) గురువారం ఉదయం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.?ఆలయానికి విచ్చేసిన శాస్త్రికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద మంత్రోచ్ఛారణలతో దివ్యాశీస్సులు అందజేశారు. ఈవో వి.కె. శీనా



నాయక్ శ్రీ అమ్మవారి శేషవస్త్రం సమర్పించి, చిత్రపటం మరియు ప్రసాదాలను అందజేసి సత్కరించారు.?ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ.. డా. సింహాచల శాస్త్రి తన అద్భుతమైన గాత్రం, అపారమైన పాండిత్యం, విశిష్ట అభినయంతో తెలుగు రాష్ట్రాల్లో హరికథా గాన కళకు విశేష గుర్తింపు తెచ్చారని కొనియాడారు. ముఖ్యంగా ఇటీవల సామాజిక మాధ్యమాలలో శాస్త్రి గారి ప్రవచనాలు, 'మంచి మాటలు' కోట్లాది మంది వీక్షకులను ఆకట్టుకుంటూ విశేష ప్రజాదరణ పొందాయని పేర్కొన్నారు. మన సనాతన ధర్మం, భక్తి విశిష్టత, భారతీయ సంస్కృతి-సంప్రదాయాల ఔన్నత్యాన్ని నేటి యువతరానికి అర్థమయ్యే రీతిలో తెలియజేస్తూ మార్గదర్శనం చేస్తున్న శాస్త్రి ఆధ్యాత్మిక సేవలు ఎంతో ప్రశంసనీయమని ఈవో అభినందించారు.?తనకు అమ్మవారి దివ్య దర్శనం కల్పించి సత్కరించినందుకు ఆలయబృందానికి డా. ఎం. వి. సింహాచల శాస్త్రి ధన్యవాదాలు తెలియజేశారు.

# నారాయణరెడ్డి స్ఫూర్తితో కార్మిక పోరాటాలు పెంపొందించాలి -సీ హెచ్ బాబురావు




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** ముఠా కార్మిక నాయకుడు,సిపిఎం కార్యకర్త కామ్రేడ్ సూరసాని నారాయణరెడ్డి స్ఫూర్తితో కార్మిక,ప్రజా పోరాటాలను పెంపొందించాలని సిపిఎం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ శ్రీ సిహెచ్ బాబురావు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం భవానిపురం, హెచ్.బి కాలనీ,మున్సిపల్ కళ్యాణమండపంలో నారాయణరెడ్డి సంతాప సభ ముఠావర్కర్ యూనియన్,సిఐటియు విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు సిఐటియు నగర అధ్యక్షులు ఈవి నారాయణ అధ్యక్షత వహించగా.. నారాయణరెడ్డి చిత్రపటానికి ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం సీతారాములు సిపిఎం మాజీ కార్పొరేటర్ బోయి సత్యబాబు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సభలో బాబురావు మాట్లాడుతూ..ముఠా రంగంలో సిఐటియు నిలదొక్కుకుని అభివృద్ధి చెందటానికి కామ్రేడ్ నారాయణరెడ్డి చేసిన కృషి ఎనలేనిద న్నారు. నమ్ముకున్న ఎర్రజెండా సిద్ధాంతానికి తుది శ్వాస వరకు నిలబడి పోరాటాలు కొనసాగించారన్నారు. ఎంతో ధైర్యంగా అడ్డంకులను అధిగమించి కార్మిక వర్గం శ్రేయస్సు కోసం పోరాటాల్లో ముందుండేవారని అన్నారు. అటు కుటుంబాన్ని,ఇటు సిపిఎం-సిఐటియు ల అభివృద్ధికి కృషి చేస్తూనే ప్రజల మన్ననలను పొందారన్నారు. నారాయణరెడ్డి అంటే ఒక నమ్మకం. ఒక స్ఫూర్తి అని చెప్పారు. ఆపదలో ఉన్న తోటి కార్యకర్తలకు తన వంతు సహాయం అందించడానికి ముందుండేవాడిని ధైర్యం చెప్పే వాడిని అన్నారు. వయసు పెరిగినా అతనిలో కమ్యూనిస్టు స్పిరిట్ తగ్గలేదన్నారు. నారాయణ రెడ్డి భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన పనివిధానం,నిజాయితీ,రాజకీయంగా నిలబడిన తీరు అందరికీ ఆదర్శం అన్నారు. కార్మిక,ప్రజా పోరాటాలను పెంపొందించటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసు చౌదరి సుబ్బారావు కె.వి.ఆర్ అచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు బ్రహ్మంగారిమఠం భట్రాజుల వీధిలో కూలిపోయిన మెట్ల దారి

**కూలిపోయిన మెట్ల దారి, దెబ్బతిన్న ఇళ్లను వెంటనే బాగు చేయించాలని ప్రతిపాటి శ్రీధర్ కు పేరాబత్తుల రమణ విజ్ఞప్తి**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24: (వార్త ప్రభ ప్రతినిధి)** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 45వ డివిజన్ బ్రహ్మంగారిమఠం వద్ద భట్రాజుల వారి వీధిలోని నడకదారి మెట్లు కుప్పకూలిపోవడంతో క్రింద ఉన్న రెండు రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. విషయం తెలిసిన వెంటనే ఆ ప్రాంతాన్ని గురువారం ఉదయం తెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పేరాబత్తుల రమణ టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. స్థానిక ప్రజలు రమణకు తమ ఇబ్బందులను తెలియజేశారు. ఈ సందర్భంగా పేరాబత్తుల రమణ మాట్లాడుతూ మెట్ల దారి కూలిపోవడంతో గంగులు జానకి, లింగం నాగమణి, బండారి రమాదేవి, లింగం దుర్గ, జనగిరి ఆదిలక్ష్మిల ఇళ్ళు దెబ్బతిన్నాయని చెప్పారు. నానుడి వర్షానికి కొండ చరియలు, ప్రమాదకరంగా ఉన్న కొండ రాళ్ళు విరిగిపడే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని కొండ ప్రాంత ప్రజలకు ఆయన సూచించారు. మెట్ల దారి కూలిపోవడంతో నడిచే సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నందున వెంటనే ఆ దారిని బాగు చేయించాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కు రమణ విజ్ఞప్తి చేశారు. కాగా మెట్ల దారి కోల్పోయిన ప్రాంతాన్ని కొత్తపేట సీఐ కొండలరావు, నగర పాలకసంస్థ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చైతన్య, వీఆర్వో తదితరులు పరిశీలించారు. ఇంకా వర్షాలు కురుస్తున్నందున అక్కడి ప్రజలను వెంటనే అన్నపూర్ణాదేవి స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రాయన రాజా, పేరాబత్తుల వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రతకు పకడ్బందీ చర్యలు: ఈవో వి.కె. శీనా నాయక్

**అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించిన ఈవో**

**వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజ్ నిర్వహణ**

**భక్తులకు వేడివేడి అన్నప్రసాదం పంపిణీ**

**వృద్ధులు, దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు, లిఫ్టులు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశం**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో విస్తారంగా, విజయవాడ నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తుల భద్రత, సౌకర్యాలపై దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ గురువారం ఉదయం ఆలయ అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు.?వర్షం కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన సహాయక, రక్షణ చర్యలపై అన్ని విభాగాల అధికారులకు ఈవో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భక్తులు నడిచి వచ్చే రోడ్డు, మెట్ల మార్గం, క్యూలైన్ల పరిసరాలలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాలు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. వర్షపు నీటితో పాటు రాళ్లు, మట్టి కొట్టుకురాకుండా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షం వల్ల క్యూలైన్లు, నడక మార్గాల్లో భక్తులు జారి పడే ప్రమాదం ఉన్నందున రబ్బరు మ్యాట్లు, కార్పెట్లు ఏర్పాటు చేయాలి. ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని కాపలా ఉంచాలి. వర్షంలో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చంటి బిడ్డల తల్లులు ఇబ్బంది పడకుండా మహా మండపం వరకు, మళ్ళీ క్రిందకు చేరవేసేందుకు బ్యాటరీ వాహనాలను పూర్తిస్థాయిలో నడపాలి. అలాగే లిఫ్ట్ సౌకర్యాలు నిరంతరం పనిచేసేలా సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. చలి వాతావరణం, వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు కడుపునిండా వేడివేడి ఆహార పదార్థాలను అన్నప్రసాద భవనంలో అందించాలి. తాగునీటి విభాగాల్లోనూ వేడినీటి సదుపాయం కల్పించాలి. వర్షపు నీరు తాకే అవకాశం ఉన్న వైరింగ్, విద్యుత్ స్తంభాలు, లైటింగ్ బోర్డుల వద్ద ఎలక్ట్రికల్ విభాగం ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి. ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్లు జరగకుండా నిరంతర నిఘా ఉంచాలి.?ప్రథమ చికిత్స కేంద్రంలో అవసరమైన అన్ని రకాల అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి.?వర్షం తీవ్రత తగ్గేవరకు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్లలో అందుబాటులో ఉంటూ భక్తులకు ఎప్పటికప్పుడు సేవలందించాలని ఈవో ఆదేశించారు.?ఈ అత్యవసర సమావేశంలో స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీమతి ఎల్. రమ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పి. చంద్రశేఖర్, ఎన్. రమేష్ బాబు, డాక్టర్ కె. గంగాధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవీంద్రనాథ్ ఠాగూర్, అశోక్ కుమార్, సూర్యనారాయణ మరియు పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

# దైవానికి ఇష్టమే!



ఆత్మవిశ్వాసంతో
నిరంతర పరిశ్రమతో
ఏదైనా సాధ్యమే
విజయం దాసోహమే
శ్రేష్ఠమైన ధ్యానంతో
విలువైన జ్ఞానంతో
దొరుకునోయ్! ఆనందమే
అంతులేని గౌరవమే
చేసిన మంచి పనులతో
శుద్ధమైన మనసులతో
దేవున్ని మెప్పించవచ్చు
హాయిగా జీవించవచ్చు
ఘనమైన క్షమాగుణము
మదిలోన ప్రేమ వనము
దైవానికి బహు ఇష్టమే
చూడంగా శ్రేష్ఠమే

**-గద్వాల సోమన్న**
, ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# జగ్గయ్యపేట స్మైల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

## 10 కిలోల భారీ గడ్డ తొలగింపు

**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 23 (వార్తప్రభ)**పట్టణం లోని బస్టాండ్ పక్కన గల స్మైలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసి మహిళ గర్భసంచిలో ఏర్పడిన సుమారు 10 కిలోల బరువున్న భారీ గడ్డను డాక్టర్ గౌతమి, డాక్టర్ అనూష విజయవంతంగా తొలగించారు.జగ్గయ్యపేట నియోజకవర్గం లోని పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన మహిళ(36)సుమారు రెండు వారాల క్రితం తీవ్ర రక్తహీనతతో పాటు విపరీతమైన కడుపునొప్పితో జగ్గయ్యపేటలోని స్మైల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చికిత్స కోసం వచ్చారు. రోగికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం డాక్టర్ అనూష MSOGB (మాస్టర్ అఫ్ సర్జరీ ఇన్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనాకలజీ), డాక్టర్ గౌతమీ MSOGB (మాస్టర్ అఫ్ సర్జరీ ఇన్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనాకలజీ) గర్భాశయంలో భారీ గడ్డ ఉన్నట్లు గుర్తించారు. అయితే రోగి హిమోగ్లోబిన్ స్థాయి కేవలం 5 పాయింట్లు మాత్రమే ఉండటంతో, వెంటనే శస్త్రచికిత్స చేయకుండా ముందుగా రోగి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు చేపట్టారు.వైద్య బృందం పర్యవేక్షణలో 5 యూనిట్ల రక్తం ఎక్కించి హిమోగ్లోబిన్ స్థాయిని 11 పాయింట్లకు పెంచారు. అనంతరం రోగిని శస్త్రచికిత్సకు సిద్ధం చేసి, అవసరమైన అన్ని వైద్య ప్రమాణాలు మరియు భద్రతా ప్రోటోకాల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర వైద్య సిబ్బంది సమన్వయంతో ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్రచికిత్సలో సుమారు 10 కిలోల బరువున్న భారీ గర్భాశయ గడ్డను విజయవంతంగా తొలగించారు. శస్త్రచికిత్స సమయంలో రోగి పరిస్థితిని నిరంతరం



పర్యవేక్షిస్తూ, అనస్థీషియా, రక్తమార్పిడి, శస్త్రచికిత్స మరియు శస్త్రచికిత్స అనంతర సంరక్షణకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి, చికిత్సకు చక్కగా స్పందిస్తూ కోలుకుంటున్నారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఆమె ఆరోగ్యం మెరుగుపడుతోంది. పూర్తిగా కోలుకున్న అనంతరం త్వరలోనే డిశ్చార్జ్ చేయడానికి వైద్య బృందం ప్రణాళిక చేస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

**సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా శస్త్రచికిత్స** పేద కుటుంబానికి చెందిన మహిళ కి ఆర్థిక భారం లేకుండా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా శస్త్రచికిత్స చేయించడం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులకు ఎంతో ఉపశమనం లభించింది.అత్యంత తక్కువ



హిమోగ్లోబిన్ స్థాయితో వచ్చిన రోగికి ముందుగా రక్తహీనతను సరిదిద్ది, అనంతరం అవసరమైన వైద్య ప్రోటోకాల్స్‌ను పాటిస్తూ విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన స్మైల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందాన్ని ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది.

## వైభవంగా వినాయక చవితి వేడుకలు



**గన్నవరం, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గన్నవరం గౌడపేటలో నిర్వహించిన వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగాయి. ఈ కార్యక్రమానికి గౌరవ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సోదరులు, యార్లగడ్డ సతీష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడపేటలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి, శ్రీ వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు, భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్ ఓ సీ అందజేత



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ ఓ సీ ను బాధిత కుటుంబానికి భవాని పురం ఎన్డీయే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్,42 వ డివిజన్ బీజేపీ ఇన్చార్జ్ బెన్నా భక్తుల సోమేశ్వరరావు తో కలిసి అందజేశారు.హెచ్ బీ కాలనీ కు చెందిన ముక్కపాటి వాణి (58) అనీమియా మరియు గర్భాశయ సంబంధిత సమస్యతో బాధపడుతూ అత్యవసర వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 2.53 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు..త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## ఇళ్లలోకి చేరిన నీటిని మోటార్లతో తొలగింపు.

**కాలువల్లో గుర్రపుడెక్కలు తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశాలు**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24(వార్త ప్రభ ప్రతినిధి)** తుఫాను వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం లోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వెంటనే స్పందించారు. గురువారం 63వ డివిజన్ సుందరయ్యనగర్, రాజీవ్‌నగర్, 64వ డివిజన్ కండ్రిక శివారు ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుడు కాకోలు రవికుమార్ తో కలిసి జోరువానలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఇళ్లలోకి వర్షపు నీరు చేరిన ప్రాంతాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఇళ్లలో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే అధికారులను అప్రమత్తం చేశారు. మోటార్లు ఏర్పాటు చేసి నీటిని యుద్ధప్రాతిపదికన బయటకు తరలించాలని ఆదేశించారు. నీటి తొలగింపు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లోని అనుసంధాన కాలువలు, డ్రైనేజీ మార్గాలను పరిశీలించిన ఆయన, భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్లు గుర్తించారు.వెంటనే జేసీబీలను ఏర్పాటు చేసి గుర్రపుడెక్కలు, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించాలని, కాలువల్లో నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాల్లో మోటార్ల ద్వారా వెంటనే నీటిని బయటకు తోడిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.అవసరమైన చోట మోటార్లు, జేసీబీలు ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపడతామని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అవసరమైన వారికి పునరావాస కేంద్రాల్లో వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా నీరు నిలిచినట్లు సమాచారం అందితే వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షులు కాకొల్లు రవికుమార్ తో పాటు డివిజన్ నాయకులు, కార్యకర్తలు సంబంధిత అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి.. పంచాయతీ సెక్రెటరీ లకు ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశం

**ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా క్షేత్రస్థాయిలోనే ఉండాలని సూచన**

**నీరు నిలిచిన ప్రాంతాలు, దెబ్బతిన్న రహదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశం**



**గన్నవరం,సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ):** తుఫాన్ ప్రభావం తో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. ఈ మేరకు గురువారం పంచాయతీ సెక్రటరీలతో వర్చువల్ విధానంలో అత్యవసర సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉన్నందున పంచాయతీ సెక్రటరీలు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలు, దెబ్బతిన్న రహదారులు, మురుగునీటి పారుదల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల భద్రతకే తొలి ప్రాధాన్యమివ్వాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.నియోజకవర్గంలో వర్షాల పరిస్థితిని పంచాయతీ సెక్రెటరీ ల వాట్సాప్ గ్రూప్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అందించే సమాచారాన్ని వెంటనే పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారీ వర్షాల్లోనూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సేవలను అభినందించిన ఆయన, వర్షాల ప్రభావం తగ్గే వరకు ఇదే సేవాస్ఫూర్తితో ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## వర్షాలకు బ్రహ్మంగారిమఠం భట్రాజుల వీధిలో కూలిపోయిన మెట్ల దారి

**కూలిపోయిన మెట్ల దారి, దెబ్బతిన్న ఇళ్లను వెంటనే బాగు చేయించాలని ప్రతిపాటి శ్రీధర్ కు పేరాబత్తుల రమణ విజ్ఞప్తి**

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24: (వార్త ప్రభ ప్రతినిధి)** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 48వ డివిజన్ బ్రహ్మంగారిమఠం వద్ద భట్రాజుల వారి వీధిలోని నడకదారి మెట్లు కుప్పకూలిపోవడంతో క్రింద ఉన్న రెండు రేకుల ఇళు దెబ్బతిన్నాయి. విషయం తెలిసిన వెంటనే ఆ ప్రాంతాన్ని గురువారం ఉదయం తెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పేరాబత్తుల రమణ టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. స్థానిక ప్రజలు రమణకు తమ ఇబ్బందులను తెలియజేశారు. ఈ సందర్భంగా పేరాబత్తుల రమణ మాట్లాడుతూ మెట్ల దారి కూలిపోవడంతో గంగులు జానకి, లింగం నాగమణి, బండారి రమాదేవి, లింగం దుర్గ, జనగిరి ఆదిలక్ష్మిల ఇళ్ళు దెబ్బతిన్నాయని చెప్పారు. నానుడి వర్షానికి కొండ చరియలు, ప్రమాదకరంగా ఉన్న కొండ రాళ్ళు విరిగిపడే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని కొండ ప్రాంత ప్రజలకు ఆయన



సూచించారు. మెట్ల దారి కూలిపోవడంతో నడిచే సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నందున వెంటనే ఆ దారిని బాగు చేయించాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్ కు రమణ విజ్ఞప్తి చేశారు. కాగా మెట్ల దారి కోల్పోయిన ప్రాంతాన్ని కొత్తపేట సీఐ కొండలరావు, నగర పాలకసంస్థ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చైతన్య, వీఆర్వో తదితరులు పరిశీలించారు. ఇంకా వర్షాలు కురుస్తున్నందున అక్కడి ప్రజలను వెంటనే అన్నపూర్ణాదేవి స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రాయన రాజా, పేరాబత్తుల వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సాహిత్య వైభవం.. విజ్ఞాన భాండాగారం!

**ప్రాచీన తెలుగు సాహిత్యంపై రెండు రోజుల జాతీయ సదస్సు**

**ప్రాచీన కావ్యాల్లో ఖగోళం, గణితం, మానసిక విజ్ఞాన విశేషాలపై ప్రముఖుల స్పష్టీకరణ**






**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్త ప్రభ ప్రతినిధి)**సాహిత్యం కేవలం కల్పనకో, రసానుభూతికో పరిమితం కాదని, ప్రకృతి రహస్యాల నుంచి పంచభూతాల వరకు సకల శాస్త్ర విజ్ఞానాన్ని భావి తరాలకు అందించిన సజీవ ప్రవాహమని పలువురు సాహిత్యవేత్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. విజయవాడలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల, నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగనున్న 'ప్రాచీన తెలుగు సాహిత్యంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం' జాతీయ సదస్సు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఖగోళ శాస్త్రం మొదలుకుని ఆధునిక మానసిక శాస్త్రం, ఆయుర్వేదం, గణితం, ఇంజనీరింగ్, విపత్తుల నిర్వహణ వరకు మన ప్రాచీన కావ్యాల్లో నిక్షిప్తమైన వైజ్ఞానిక సంపదను సాహితీవేత్తలు ఈ వేదికగా అద్భుతంగా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచానికి జ్ఞాన దృష్టిని అందించిన భారతదేశం.. వేదకాలం నుంచే సమస్త విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు అందించే ప్రయత్నం చేసిందన్నారు. జానపద సాహిత్యం కూడా పామరులకు జ్ఞానాన్ని పంచిందని, నన్నయ్య కాలం నాటి నుంచి మన తెలుగు సాహిత్యం కేవలం భక్తి తత్వానికే పరిమితం కాకుండా సమస్త శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందించిందన్నారు. అధునాతన శాస్త్ర పరికరాలు లేని ప్రాచీనకాలంలో నక్షత్రాలను, ఆకాశాన్ని చూసి వర్షం వస్తుందో రాదో కచ్చితంగా చెప్పే ఖగోళ విజ్ఞానం మన సాహిత్యంలో ఉందని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద', మహాభారత, రామాయణాల ద్వారా పరిపాలకులు ఎలా ఉండాలో స్పష్టమైన రాజనీతిని తెలుసుకోవచ్చన్నారు. ప్రపంచంలో మొదటిగా విమానాన్ని నడిపింది రావణాసురుడు అనే విషయంలో పరిశోధన చేసేందుకు శ్రీలంక ప్రభుత్వం ఓ కమిటీని నియమించటం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రకాశన చేసి ప్రారంభించిన రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సంచాలకులు రేగుళ్ళ మల్లికార్జునరావు మాట్లాడుతూ చాలామంది సాహిత్యాన్ని కేవలం ఆనందం కోసమే చూస్తారని, "అన్ని వేదాల్లోనే ఉన్నాయి" అని అతిగా చెప్పడం ఎంత తప్పో, "మన సాహిత్యంలో ఏమీ లేదు" అని నిరాశ పడటం కూడా అంతే తప్పు అన్నారు. సాహిత్యంలో చెప్పిన విషయాన్ని సరిగ్గా బేరీజు వేసుకోవాలని; తులనాత్మక అధ్యయనం చేయాలని సూచించారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలోని విభిన్న కోణాల అధ్యయనం ద్వారా సాహిత్య పరిశోధనల్లో నూతన అంశాలు ఆవిష్కృతమవుతాయన్నారు. తెలుగు భాషా పరిరక్షణ, పరిశోధన రంగాల్లో ప్రాచీన కేంద్రం చేస్తున్న కృషిని వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.నాగరాజు, సదస్సు సమన్వయకర్త డాక్టర్ కప్పగంతు రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. అనంతరం జరిగిన సదస్సుల్లో ఆచార్య సాగి కమలాకరశర్మ (ఉస్మానియా యూనివర్సిటీ), కస్తూరి మురళీకృష్ణ, డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, డాక్టర్ ప్రఖ్య సత్యనారాయణ శర్మ, మోదుగుల రవికృష్ణ, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ తదితర ప్రముఖ సాహితీవేత్తలు ప్రసంగించారు.

## ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం

**చిన్నపాటి వర్షానికే వాహనాల రాకపోకలకు అంతరాయం**



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)** పట్టణంలోని కోదాడ రోడ్డు విస్తరణ పనులలో ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. తుఫాను నేపథ్యంలో కురిసిన చిన్నపాటి వర్షానికే జాతీయ రహదారికి దగ్గరలోని తపోవన్ స్కూల్ వద్ద వర్షపు నీరు రోడ్డు పైకి చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, పలు వాహనాలకు ఇంజన్లోకి నీళ్లు పోయి వాహనాలు పాడైపోయాయని. వర్షపు నీరు, సాగర్ జలాలు వచ్చినప్పుడు నిటి ప్రవాహానికి ఏర్పాట్లు చేయాలని స్థానికులు, మీడియా ప్రతినిధులు ముందుగానే హెచ్చరించినా పెడచెవిని పెట్టిన ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని. చిన్నపాటి వర్షానికి పరిస్థితి ఇలా ఉంటే సాగర్ జలాలు విడుదలైనప్పుడు, వర్షాలు కురిసిన ప్రతిసారి పట్టణంలోకి వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని.ఉన్నతాధికారులు స్పందించి నీటి ప్రవాహానికి ఏర్పాట్లు చేసి నూతన రోడ్డు నిర్మించాలని. మరియు రోడ్డు నిర్మాణ నాణ్యత ప్రమాణాలపై తమకున్న అనుమానాలను నివృత్తి చేసి అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కాలువలో స్తంభం.. మట్టి కుప్పలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులకు స్థానికుల విజ్ఞప్తి**



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 24 (వార్తప్రభ)**జగ్గయ్యపేట-- కోదాడ రహదారిలోని సిద్ధార్థ నగర్ 1వ వీధి, బొజ్జ డెంటల్ హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలో కొత్తగా నిర్మించిన కాలువ మధ్యలో స్తంభం ఉండటంతో చెత్తాచెదారం పేరుకుపోతోంది. మరోవైపు ప్రవహించే మురికి నీరు, పేరుకుపోయిన మట్టి కుప్ప కారణంగా సక్రమంగా ప్రవహించలేకపోతోంది. నీరు ప్రవహించాల్సిన మార్గంలో మొక్కలు పెరిగి, కాలువలో నీటి ప్రవాహం మరింత మందగిస్తోంది. దీంతో ఇప్పటికే వర్షాల వలన నీరు సక్రమంగా వెళ్లక, రోడ్డు పరిసరాల్లో అపరిశుభ్రత ఏర్పడటంతో ప్రజలు దోమల వలన ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని పరిశీలించాలి. కాలువ మధ్యలో ఉన్న స్తంభం వల్ల ఏర్పడుతున్న ఆటంకాన్ని తొలగించి, కాలువల వెళ్ళే మార్గంలో ఉన్న మట్టి కుప్పలను పూర్తిగా తొలగించాలి. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మొక్కలను వెంటనే తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే సమస్యను ఎదుర్కొంటున్న ప్రజలకు మరింత ఇబ్బంది కలగకుండా అధికారులు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని సిద్ధార్థ నగర్ 1వ వీధి ప్రజలు కోరుతున్నారు.

## గణపనేని అంకినీడు గారికి సర్వీస్ ఇనామ్ బాధితులు సంతాపం



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 24 (వార్తప్రభ)**సర్వీస్ ఇనాం బాధితుడు గణపనేని అంకినీడు (71) గారి మృతికి సర్వీస్ ఈనాం భూ బాధితుల సంఘం సంతాపం తెలిపింది. 22న రాత్రి అంకినీడు మృతి చెందారు. ఇనామ్ బాధితుల రిలే నిరాహార దీక్ష శిభిరాలకు హాజరై ఆయన సంఘీభావం తెలుపుతున్నారు. భూముల నిషేధం పై మధన పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వీస్ ఇనాం బాధితులు ఈ విధంగా మధనపడుతూ చనిపోతున్నారని బాధితుల సంఘం ప్రతినిధి గద్దె సుదీర్, యలవర్తి అచ్యుత రామయ్య, రంగాపురం నాగేశ్వరావు, కుక్కడకు ప్రసాదు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది కుమిలిపోతూ సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందోనని బెంగతో చనిపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు జోహార్ అంకినీడు అమరహే అంకెనీడు అంటూ నినాదాలు చేశారు కార్యక్రమంలో షేక్ జాన్బాషా, జి సుబ్బారావు, కళ్యాణం మురళి, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల వేళ పంటల పరిస్థితిపై జేసీ ఇలక్కియ పరిశీలన



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 24 (వార్తప్రభ)**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పంటలకు నష్టం వాటిల్లకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ఆదేశించారు. గురువారం వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో పర్యటించిన ఆమె పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు.వర్షాల ప్రభావంతో పొలాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి నీటి పారుదలకు అవసరమైన చర్యలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. పంటలకు నష్టం జరిగితే క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.అనంతరం లింగాల వంతెనను పరిశీలించిన జేసీ.. భారీ వర్షాల నేపథ్యంలో వంతెనలు, వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జగ్గయ్యపేట పట్టణంలోని ఊర చెరువును పరిశీలించి నీటి నిల్వ, ప్రవాహం, పరిసర ప్రాంతాల పరిస్థితిని తెలుసుకున్నారు.ఈ పర్యటనలో నందిగామ ఆర్‌డీవో జి. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి విస్తరణకు సంబంధించి స్థలాలు, భవనాలు కోల్పోయే వారికి సముచిత న్యాయం చేస్తాం.

**-పిఎసి ఛైర్మన్ అరికపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ):**మసీదుబండలో 100 అడుగుల రహదారి విస్తరణకు సంబంధించి స్థలాలు,భవనాలు కోల్పోతున్న వారికి పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ అంగీకార పత్రాలు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీలు ప్రసిద్ధ,సుష్మ, హబీబా,సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మారబోయిన రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.మాస్టర్‌ప్లాన్‌లో 120 అడుగులుగా ఉన్న రహదారిని 100 అడుగులకు పరిమితం చేసి విస్తరణకు స్థానికులను ఒప్పించినట్లు గాంధీ తెలిపారు. స్థలాలు,భవనాలు కోల్పోతున్న వారికి సముచిత న్యాయం చేయడంతో పాటు టీఆర్ఆర్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రహదారి విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

## బాచుపల్లి, గాజులరామారంలో ఘనంగా గణేష్ ఉత్సవాలు

**వేడుకల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**అన్నదాన వితరణలో పాల్గొన్న నాయకులు**





**బాచుపల్లి, సెప్టెంబర్ 24, (వార్తాప్రభ) :** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిజాంపేట్ సర్కిల్, గాజులరామారం పరిధిలోని పలు గణపతి మండపాలను కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గురువారం సందర్శించారు. బాచుపల్లిలో మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాజులరామారం డివిజన్ పరిధిలోని వోక్షిత్ హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడిని దర్శించుకుని శాస్త్రోక్తంగా అర్చనలు చేశారు. ఆ తర్వాత అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడారు. ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్, సురేందర్ రెడ్డి, ఈనాడు శ్రీనివాస్, సోమిరెడ్డి, భాస్కర్ గౌడ్, మహమ్మద్ ఖాజాతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్.



**కీసర, సెప్టెంబర్ 24(వార్తా ప్రభ):**మేడ్చల్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్ (ఐఏఎస్) గురువారం రోజున మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, వైస్ ఛైర్మన్ విట్టల్ నాయక్, డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగాజిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూమార్కెట్ కమిటీలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులపై డైరెక్టర్ రాహుల్ రాజ్ అధికారులతో చర్చించారన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అలాగే మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన నూతన పనులకు మంజూరు మరియు చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (జెడి) మల్లేశం, (డిడిఎం) ప్రసాద్ రావు,(డిఎం ఓ) ఎం.డి. రియాజ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ, అసిస్టెంట్ సెక్రటరీ మరియు మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారని జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ విఠల్ నాయక్ తెలిపారు.

# దుండిగల్‌లో అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఇంట్లో వారిని బాత్రూంలో బంధించి దోపిడీకి పాల్పడిన నేరగాళ్లు
- ఐదుగురు నిందితుల అరెస్ట్.. 2.1 కిలోల వెండి ఆభరణాల స్వాధీనం



**దుండిగల్ సెప్టెంబర్ 24, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ జోన్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. దుండిగల్ పోలీసులు, కుత్బుల్లాపూర్ సీసీఎస్ బృందాలు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్లు కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ పరిధిలో అమ్మవారి పూజలు నిర్వహించే ఒక వ్యక్తి ఇంట్లో లేని సమయం చూసి ఈ నెల 16న మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో ఎనిమిది మంది దుండగులు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మరొకరిని బెదిరించి బలవంతంగా బాత్రూముల్లో బంధించారు. అనంతరం ఇంట్లోని నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రత్యేక బృందాలు విస్తృతంగా గాలించి దుండిగల్ రోటరీ-1 వద్ద నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. పట్టుబడిన వారిలో కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన కొనెంగి అనిల్ కుమార్ (35), అమ్మటి రమేష్ (48), మెదక్ జిల్లాకు చెందిన దేగావత్ రవి (41), కొర్పోతు చిన్న శైలు (50) ఉన్నారు. వీరికి సహకరించిన రాజస్థాన్‌కు చెందిన ఫర్సా రామ్ రాణా (20)ను ఇప్పటికే న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు అశోక్, భవాని, రాకేష్, ఇక్కు ఖాన్, జుబైర్ ఖాన్ పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు డీసీపీ తెలిపారు.ఎక్కువ మొత్తంలో నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఉంటాయని భావించే ఇళ్లను ఈ ముఠా లక్ష్యంగా చేసుకుంటుంది. బాధితుల కదలికలపై నిఘా ఉంచి, ఇంట్లో తక్కువ మంది ఉన్న సమయం చూసి దాడి చేసి దోపిడీలకు పాల్పడుతుంటారు. పట్టుబడిన నిందితుల నుంచి సుమారు రూ. లక్షల విలువైన 2.1 కిలోల వెండి ఆభరణాలను (వెండి సాదా కడియాలు, కాళ్ల కడియాలు, పట్టీలు) పోలీసులు రికార్డు స్థాయిలో రికవరీ చేశారు. మేడ్చల్ ఏసీపీ సిహెచ్. శంకర్ రెడ్డి, సీసీఎస్ ఏసీపీ సామల వెంకటేష్ పర్యవేక్షణలో కేసును వేగంగా ఛేదించిన దుండిగల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్ నాయుడు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మరియు సిబ్బందిని డీసీపీ కోటిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

**ప్రజలకు పోలీసుల భద్రతా సూచనలు** కొద్దిసేపు బయటకు వెళ్లినా తలుపులు, కిటికీలు సరిగ్గా తాళం వేయాలి. నగదు, విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఇంట్లో సులభంగా దొరికే ప్రదేశాల్లో ఉంచవద్దు. ప్రధాన ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని, కనీసం 30 రోజుల ఫుటేజీ భద్రపరిచేలా చూసుకోవాలి. దృఢమైన తాళాలు, వీడియో డోర్‌బెల్స్ వంటి ఆధునిక భద్రతా వ్యవస్థలను వినియోగించాలి.ఊర్లకు వెళ్లే సమయంలో నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వాలి. ప్రయాణ వివరాలు, ఇంట్లో ఎవరూ లేని సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దు.

# బుడమేరుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- ఎలాంటి వదంతులను నమ్మవద్దు
- క్షేత్రస్థాయిలో అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంది
- ప్రజల భద్రతకు అధికార యంత్రాంగం అప్రమత్తం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**బుడమేరుకు సంబంధించి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, నీటి ప్రవాహం, నీటిమట్టం తదితర పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల్లోని నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని, అధికారికంగా అందించే సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్‌తో పాటు సమన్వయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని, పరిస్థితుల్లో ఏవైనా మార్పులు చోటుచేసుకున్నట్లయితే ప్రజలకు వెంటనే సమాచారం అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. గత వరదలు తర్వాత గండ్ల పూడ్చివేత, కట్ట బలోపేతం, వెలగలేరు రెగ్యులేటర్ ఆధునీకరణ వంటి పలు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అందువల్ల ఎలాంటి ఇబ్బందీ లేదని స్పష్టం చేస్తూ ప్రజలు ఏదైనా అధికారిక సమాచారం, సహాయసహకారాలకు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (9154970454)లో సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా రమేష్ బాధ్యతల స్వీకరణ....



**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)** మండల పరిషత్‌లో ఎన్నికైన సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు మరొకసారి గుడ్లవల్లేరు మండల పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు సాధికారత అధికారి గుమ్మా రమేష్ నియమితులయ్యారు. ఆయన గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలు, అభివద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక మరియు పరిపాలనా అంశాలను పర్యవేక్షించడంతో పాటు మండల పరిషత్ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించామని ఆ అంశాలపై ఇకపై మరింతగా దష్టి సారిస్తామని రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓలు జి.ఎస్.ఎస్.అంజనాదేవి, ఎలీషా, జూనియర్ అసిస్టెంట్ పి.బలరామ్, గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు తదితర సిబ్బంది అభినందించిన వారిలో ఉన్నారు.

# ముంపు ప్రాంతాల్లో ఎంపీడీఓ ఇమ్రాన్ పర్యటన....



**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)** అకాల వర్షాల నేపథ్యంలో మండలంలోని ముంపు ప్రాంతాల్లో ఎంపీడీఓ ఇమ్రాన్ పర్యటించారు. గురువారం అకాల వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. గుడ్లవల్లేరు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించి చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడాన్ని గమనించిన ఎంపీడీవో ఇమ్రాన్ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు, వైద్య సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావును ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా రహదారిని సౌకర్యవంతంగా ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు అకాల వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో తెలిపారు. వర్షాల కారణంగా ఏదైనా సమస్య తలెత్తినట్లయితే దానిని వెంటనే తన దష్టికి లేదా సంబంధిత శాఖ అధికారుల దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు, అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# చంద్రగిరిలో కుక్కల రాజ్యం.. ప్రజలకు ప్రాణభయం...అధికారుల మౌనం

**నెలకు 250కిపైగా కుక్కకాటు కేసులు**




**చంద్రగిరి: సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**చంద్రగిరి పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ప్రధాన రహదారులు, వీధులు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, ఏటీఎం కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు, ఎటువైపు నుంచి కుక్కలు దాడి చేస్తాయోనన్న భయంతో ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే ఆందోళన చెందుతున్నారు.విద్యార్థులు, మహిళలు, వృద్ధుల్లో భయాందోళన : పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ఉదయం పూట పనులకు వెళ్లే కార్మికులు, నిత్యావసరాల కోసం బయటకు వచ్చే మహిళలు, వృద్ధులు వీధి కుక్కల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా వెంబడిస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు భయంతో వాహనాల వేగాన్ని పెంచడం లేదా అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.బస్టాండ్, ఏటీఎంల వద్ద కుక్కల గుంపులు : చంద్రగిరి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లోనే పెద్ద సంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద కూడా కుక్కలు తిష్టవేయడంతో ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.నూర్ జంక్షన్ వద్ద రాత్రివేళల్లో అవస్థలు : బైపాస్ రోడ్డు, నూర్ జంక్షన్ పరిసరాల్లో రాత్రివేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. దూరప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు రాత్రిపూట బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు వచ్చిన సమయంలో కుక్కలు వెంటపడుతున్నాయని చెబుతున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయంతో పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నెలకు 250కిపైగా కుక్కకాటు కేసులు? : చంద్రగిరి, నారావారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నెలకు సుమారు 250 మందికిపైగా కుక్కకాటుకు గురైన బాధితులు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ (ఏఆర్వీ) కోసం వస్తున్నట్లు స్థానిక ఆరోగ్య వర్గాల సమాచారం. ఈ సంఖ్య అధికారికంగా పూర్తిగా నిర్ధారించాల్సి ఉన్నప్పటికీ, రెండు పీహెచ్‌సీల పరిధిలోనే ఇంతమంది బాధితులు చికిత్స కోసం వస్తుండటం సమస్య తీవ్రతపై ఆందోళన కలిగిస్తోంది.అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి : వీధి కుక్కల సమస్యపై పంచాయతీ, మండల స్థాయి అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేక డాగ్ క్యాచింగ్ బృందాలను ఏర్పాటు చేసి కుక్కలను నియంత్రించడంతో పాటు, నిబంధనల ప్రకారం సంతాన నియంత్రణ చర్యలు, వ్యాక్సినేషన్, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు వంటి చర్యలను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని చంద్రగిరి మండల ప్రజలు కోరుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుదాం

**-వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,సెప్టెంబరు 24 (వార్తాప్రభ):**గోకుల్ ప్లాట్స్ కాలనీలో వినాయక మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ,మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో చెరువులు కలుషితమవుతాయని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.వినాయక మండపాల వద్ద భద్రతా చర్యలు చేపట్టి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం సందర్భంగా పలు చోట్ల ఏర్పాటుచేసిన గణేష్ మండపాలను దర్శించుకున్న మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్.



**జవహర్ నగర్, సెప్టెంబర్ 24(వార్తా ప్రభ):**కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోబాలాజీ నగర్‌లో గురువారం గణేష్ నిమజ్జనం సందర్భంగా పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, అలాగే భక్తుల కోసం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు ప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూవిఘ్నేశ్వరుడి ఆశీస్సులతో బాలాజీ నగర్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండపం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద బీఆర్ఎస్ నేతల నిరసన

**కాంగ్రెస్ ప్రభుత్వ కరెంట్ కుట్రలను బయటపెడతామని స్పష్టీకరణ**

**అధికారుల వైఖరిని నిరసిస్తూ కార్యాలయం ఎదుట బైఠాయింపు**





**హైదరాబాద్, సెప్టెంబర్ 24, (వార్తాప్రభ) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న కరెంట్ కుట్రలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన కార్యాచరణలో భాగంగా గురువారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సింగరేణి హెడ్ ఆఫీస్‌ను సందర్శించి నిరసన చేపట్టింది. విద్యుత్ సరఫరా, బొగ్గు కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, అధికారుల తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. ప్రజలను అయోమయానికి గురిచేసే విధానాలను విడనాడాలని, సింగరేణి వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే దివాకర్, టీజీబీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో పాటు పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో మల్లవారిపాలెం-ఆరూరు మధ్య నూతన లింక్ రోడ్డు ప్రారంభం



**శ్రీసిటీ, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**శ్రీసిటీలో అంతర్గత రహదారి మౌళిక వసతులు, రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా 4 కిలోమీటర్ల పొడవైన నూతన లింక్ రోడ్డును గురువారం ట్రాఫిక్‌కు అందుబాటులోకి తీసుకొచ్చారు. శ్రీసిటీ డీఎస్పీ బి.వి.శ్రీనివాసులు లాంఛనంగా రహదారిని ప్రారంభించగా, తిరుపతి జోనల్ మేనేజర్ విజయ భరత్ రెడ్డి, డైకిన్ సీనియర్ అధికారులు సుదీప్ భట్టాచార్య, ప్రశాంత్ జోషి, వెంకటేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.ఆరూరు--రాళ్లకుప్పం రోడ్డులో మల్లవారిపాలెం-ఆరూరు మధ్యలో వున్న ఈ రోడ్డు గతంలో తక్కువ వెడల్పుతో అనేక మలుపులతో సాగేది. దీని వలన ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు సంభవించేవి. దీనికి ప్రత్యామ్నాయంగా అత్యుత్తమ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న నూతన రహదారితో వాహనాల రాకపోకలు మరింత సాఫీగా, సురక్షితంగా సాగేందుకు వీలుకలుగుతుంది. దీనిపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ, నూతన లింకు రోడ్డుతో ఈ మార్గంలోని గ్రామస్థులకు మెరుగైన రోడ్డు సదుపాయం అందుబాటులోకి రావడంతో పాటు పరిశ్రమ వర్గాలకు కూడా ప్రయోజనం చేకూరనుందన్నారు. అలాగే శ్రీసిటీలో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు.

# వర్షంలోనూ తగ్గని పోరాట స్ఫూర్తి

## – మహాత్ముడి సాక్షిగా వీఆర్ఏల వినతి



**గుడివాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోసం గుడివాడ మండల గ్రామ రెవెన్యూ సహాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అర్నబ్ తుఫాన్ ప్రభావంతో జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, గుడివాడలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని వినతిపత్రాన్ని సమర్పించారు. సమస్యలు పరిష్కరించాలంటూ మహాత్ముడి సాక్షిగా నినదించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం గుడివాడ మండలానికి విచ్చేసి వీఆర్ఏలకు మద్దతుగా నిలిచారు.

# వర్షంలో ఆకలి తీర్చిన ఆపన్న హస్తం - ఆర్కే వారియర్స్ సేవ..



**గుడివాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లపై నివసిస్తున్న పేదలు ఇబ్బంది పడుతుండటంతో స్థానిక ఆర్కే వారియర్స్ మానవత్వాన్ని చాటుకు న్నారు. రోడ్డుపై ఉన్న నిరాశ్రయులకు ఆహారం అందజేసి ఆకలి తీర్చారు. వర్షాల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు డా. మాచర్ల రామకృష్ణ (ఆర్కే) మాట్లాడుతూ సమాజమే దేవాలయంగా భావించి పేదలకు సా యం చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రోడ్డుపై ఉన్నవారు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ఆహారం అందించామ న్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణ ప్రజలు కూడా సేవా కార్యక్రమా లకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదె చరణ్, అయ్యప్ప, ఆర్కే వారియర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# గుడివాడ ఇంజినీరింగ్ కాలేజీలో మెగా జాబ్ మేళా 10,000 కోడర్స్ చే ప్లేసెమెంట్ డ్రైవ్



ఎగుడివాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) : వీకేఆర్ అండ్ వీఎన్బీ ఇంజినీరింగ్ కళాశాల లో హైదరాబాద్‌కు చెందిన 10,000 కోడర్స్ సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆటోమేషన్ పై అవగాహన కార్యక్రమంతో పాటు ప్రాంగణ ఉద్యోగ నియామక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్.ఆర్ మేనేజర్స్ పి. భరత్, ఆర్. చంద్రమౌళీ లు విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, పరిశ్రమల అవసరాలు, ఉద్యోగ నైపుణ్యాలతో పాటు భవిష్యత్ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 20 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల వార్షిక వేతనం 3 లక్షల రూపాయలుగా కంపెనీ హెచ్.ఆర్ మేనేజర్లు నియామక పత్రాలను అందజేశారు. విద్యార్థుల విజయంపై కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ వి. కోదండ రామయ్య, డైరెక్టర్ బి. కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి. ప్రసాదరావు, డీన్లు, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ ఆఫీసర్ డా. ఎన్. ధనుంజయ రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.

# తిరువూరు (మం) చింతలపాడులో సహాయక చర్యలు ముమ్మరం చేశామన్న జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా..



**తిరువూరు,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** నిన్న ఈదురుగాలులకు చింతలపాడులో దాదాపు 60 నుంచి 70 ఇళ్లు దెబ్బతిన్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడి నష్టం జరిగిన వెంటనే క్యాంపులు ఏర్పాటు చేసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు కలెక్టర్ స్పష్టంకాలువలు, నదుల సమీపానికి వెళ్లవద్దని ప్రజలకు కలెక్టర్ కీలక సూచన పశువులను సైతం జాగ్రత్తగా చూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి గాయపడిన వారికి రాష్ట్ర విపత్తు నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తున్నట్లు వెల్లడిరోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపడుతున్న అధికారులు గాయపడిన 8 నుంచి 10 మందిని ఆసుపత్రులకు తరలింపు.. ఇద్దరిని విజయవాడ జీజీహెచ్‌కు తరలింపు క్షతగాత్రుల్లో ఎవరికీ ప్రాణాపాయం లేదని.. అందరూ సురక్షితంగా ఉన్నారని కలెక్టర్ భరోసా ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు.. వైద్య సేవలకు ఆసుపత్రులను సిద్ధంగా ఉంచిన అధికారులుఏమాత్రం అస్వస్థత అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచన వర్షం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి

# తుఫాన్ ఎఫెక్ట్.. ఫీల్డ్ లోనే ఉండండి..

## –అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశం

**గుడివాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రజావేదిక నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్డీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తదితర శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించారు.

**ఎమ్మెల్యే సూచనలు / ఆరా :**

- బుడమేరు వరద ఉధృతిపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆందోళన లేదని ఆర్డీవో తెలిపారు.
- ఆఫీసర్స్ క్లబ్ వద్ద కూలిన చెట్టును నిమిషాల్లో తొలగించిన అధికారులను అభినందించారు.
- బస్టాండ్‌లో నీరు నిలవకుండా చూడాలని, డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్ పై ఫోకస్ పెట్టాలని కమిషనర్ ను ఆదేశించారు.
- రోడ్లపై సిబ్బంది కనిపించాలని, ఫీల్డ్ లోనే ఉండి పనిచేయాలని సూచించారు.
- విద్యుత్ అంతరాయాలపై సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేవని, గ్రామాల్లో చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని అధికారులు



తెలిపారు.విపత్తు తగ్గేవరకు అన్ని శాఖలు సమన్వయంతో, అప్రమత్తంగా ఉండాలని, కూటమి శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే రాము సూచించారు. ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత ఏడాది స్ఫూర్తితో ఈసారీ సమర్థంగా పనిచేస్తున్న అధికారులను ఆయన అభినందించారు.

# గుడివాడ ఆర్టీసి బస్టాండ్ జలమయం

## –అధికారులకు ఎమ్మెల్యే రాము ఫోన్..





**గుడివాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** పట్టణంలో గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. భారీ వర్షానికి నిర్మాణ దశలో ఉన్న ఆర్టిసి బస్టాండ్ లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరింది. దీంతో బస్టాండ్ ప్రాంగణంలో మోకాళ్ళ లోతు వరకు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. బస్టాండ్ లోకి నీరు చేరిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. పట్టణంలోని రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని డ్రైనేజీ వ్యవస్థ ద్వారా బయటకు పంపించే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఆర్టిసి బస్టాండ్‌లో పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెలే ఆర్టిసి సిబ్బందికి ఫోన్ చేసి ప్రత్యేక మోటార్లను ఏర్పాటు చేసి నీటిని వేగంగా బయటకు తోడాలని ఆదేశించారు. దీంతో అధికారులు హుటాహుటిన రెండు మోటార్లను ఏర్పాటు చేసి బస్టాండ్ లోకి చేరిన వర్షపు నీటిని బయటకు తోడే ప్రక్రియను ప్రారంభించారు. మరోవైపు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రాము సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని వర్షం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ప్రధాన రహదారుల్లో నీటి నిల్వలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

# జలమయమైన గుడివాడ వీధులు

## –క్షేత్రస్థాయిలో కమిషనర్ మనోహర్ పర్యటన

**గుడివాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** అర్నబ్ తుఫాన్ ప్రభావంతో గుడివాడ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పురపాలక సంఘంఅధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ క్షేత్రస్థాయిలో పలు వార్డుల్లో పర్యటించారు. నీరు నిలిచిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించి, తక్షణమే నీటిని తొలగించాలని ఇంజనీరింగ్, శానిటేషన్, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు.కమిషనర్ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగి డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను, ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తొలగిస్తున్నారు. వర్షపు నీరు సులభంగా వెళ్లేందుకు వీలుగా మురుగు కాలువలను శుభ్రం చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజనీర్ సతీష్ చంద్ర, డీఈ శివాజీ, ఏఈలు రాజేష్, శ్రవణ్ కుమార్, సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు అప్పారావు, శివలక్ష్మి, లావణ్య,



స్వర్ణ, వార్డు కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర సహాయం కోసం పురపాలక సంఘ కంట్రోల్ రూమ్ నంబర్ 8712624774 ను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

# భారీ వర్షాలు దృష్ట్యా ప్రజలు వాగులో దాటకుండా ముందు చర్యలు తీసుకోండి

## –టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

**ఏలూరు,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలు వాగులను దాటకుండా ముందస్తు జాగ్రత్తగా బారికేడ్ లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరద ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో గుర–ువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వరదల సమయంలో వాగులు,



తమ్మిలేరు, బుడమేరు వంటి ఏర్లు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో ఆకస్మిక వరద ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు వాగులు, కాజ్ వే లు దాటకుండా అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండలాల పరిధిలో తహసీల్దార్లు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరదల కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పట్టణాలు, గ్రామాలలోని కాలువలు, డ్రైన్లలో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెట్లు కూలిన ప్రదేశాలలో రవాణా వ్యవస్థకు ఎటువంటి ఆటంకం కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కూలిన విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా జీవనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా కాలువలు, చెరువులో నీటి సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరిన చోట్ల పరిసర ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వరద పరిస్థితి సాధారణ స్థితి కి వచ్చే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తతో ఉండాలన్నారు. మండల, డివిజన్ కేంద్రాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేసి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని, కంట్రోల్ రూమ్ లకు వచ్చే ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. వరద సమయంలో ఎవరూ నదులు, కాల్వలు, జలాశయాలలోనికి వెళ్లకుండా చూసేలా ఆయా ప్రదేశాలలో సిబ్బందిని నియమించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కట్లేరు వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

**గంపలగూడెం,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** గంపలగూడెం మండలం వినగడప తోటమూల గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టలేరు వాగు..కట్టలేరు వాగు వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు భారీ వర్షాలతో కట్టలేరు వాగులో పెరిగిన వరద ప్రవాహం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కట్టలేరు పై వంతెన కట్టడానికి పరిపాలన పరమైన అనుమతులు



పూర్తిచేసుకుని, ఆర్ధిక అనుమతులు కోసం ఎదురుచూస్తూ అతి త్వరలో కట్టలేరుపై వంతెన కట్టడానికి నిధులు కోసం ఎదురు చూస్తున్న సందర్భంలో దురదృష్టవశాత్తు పై ప్రాంతాల్లో రెండు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు కట్టలేరుపై భారీ వరద ప్రవాహం వస్తుంది. దీనివల్ల 20 గ్రామాల ప్రజలకు రాకపోకలు ఆగిపోయాయి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక రహదారి నిర్మాణం వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక రహదారి పనులు పూర్తి చేస్తాం -- ఎమ్మెల్యే కొలికపూడి ఆర్ధిక శాఖ అనుమతులు రాగానే కట్టలేరు వాగుపై శాశ్వత నిర్మాణం చేపడతామన్నారు ఎమ్మెల్యే భారీ వాహనాలు కట్టలేరు మార్గంలో రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలి అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దు -- ఎమ్మెల్యే కొలికపూడివిజ్ఞప్తి 48 గంటలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రజల భద్రతకు అధికారులు అందుబాటులో ఉంటారన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు 24 గంటలు నియోజకవర్గ ప్రజలకు నాతో పాటు అధికారులు అందుబాటులో ఉంటారు ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాజకుమారి,ఎండిఓ సత్యవతి, సీఐ గురుప్రకాష్,ఎస్సైఅనిల్, ఆర్అండ్బి ఐవ, పోలీసు ,రెవెన్యూ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విపత్తులో మానవత్వం చాటిన యువత

## -గుడివాడలో చిన్న యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**గుడివాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** తుఫాన్ ప్రభావంతో గుడివాడ పట్టణం వణికిపోతున్న వేళ.. ఎటూ వెళ్లలేక రోడ్డు పక్కన తలదాచుకుంటున్న అభాగ్యుల ఆకలి తీర్చేందుకు బీజేపీ నాయకుడు చిన్న యూత్ ఆధ్వర్యంలో ముందుకు వచ్చింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉంటున్న యాచకులు, వృద్ధులు, ఒంటరి మహిళలను గుర్తించి వారికి వేడి వేడి ఆహార పొట్లాలను స్వయంగా అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు చిన్న మాట్లాడుతూ.. "ఇలాంటి విపత్కర సమయంలోనే మానవత్వం చూపించాలి. ఇళ్లలో మనం సురక్షితంగా ఉంటున్నాం. కానీ రోడ్డుపై ఆకలితో అలమటిస్తున్న వారిని ఆదుకోవడం మనందరి బాధ్యత. యువత అంతా ముందుకు వచ్చి తోచిన సహాయం చేస్తే అదే పెద్ద పుణ్యం" అని పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా ఎవరూ బయటకు రాని పరిస్థితుల్లో ఆకలితో ఉన్నవారికి అండగా నిలిచిన చిన్న బృందాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

# వర్షపు నీటికి చెక్.. డ్రైనేజీ శుభ్రం





**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలిచిపోకుండా అధికారులు, పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు. గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.ఐఇందిరానగర్‌లో డ్రైనేజీ పూడుకుపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో డ్రైనేజీలోని పూడికను తొలగించి, నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ఎంజీ నగర్‌లో నిలిచిన వర్షపు నీటిని మోటార్ ద్వారా బయటకు తోడుతున్నారు. వర్షాల సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన చోట తక్షణ చర్యలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్, వరిగంజి కిషోర్, ముత్యాల సువర్ణరాజు, కడవకొల్లు రాజేష్, షేక్ సత్తార్ తదితరులు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. డ్రైనేజీల్లో పూడిక తొలగింపు, నిలిచిన నీటిని తరలించే పనులను వేగవంతం చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయ స్లాబ్ నీ పరిశీలించిన చైర్మన్



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ స్లాబ్ లీకై పలుచోట్ల వర్షపు నీరు కురుస్తుంది. ఇది గమనించిన పాలకమండలి చైర్మన్ చుంచు రమేష్ బాబు, పాలక మండలి సభ్యులు గుగులోతు రమేష్ తో కలిసి గురువారం ఆలయం మొత్తం కలియ తిరిగి స్లాబ్ కు ఎక్కడెక్కడ వర్షపు నీరు లీకవుతుందో గుర్తించి ఆలయ అధికారులకు తెలియజేసి, వెంటనే మరమ్మతులు నిర్వహించాల్సిందిగా ఆలయ ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు.

# సిరివాడ--తిప్పనగుంట రహదారిపై రాకపోకలు నిలిపివేత





**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం సిరివాడ--తిప్పనగుంట గ్రామాల మధ్య ఉన్న మురుగునీటి కాలువ వర్షాల కారణంగా పొంగిపొర్లింది. దీంతో కాలువ నీరు రహదారిపై నుంచి ప్రవహిస్తుండటంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రహదారిపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ప్రజలు అటువైపు వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ట్లు వీరవల్లి ఎస్ఐ సత్యం సురేష్ తెలిపారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పరిస్థితిని పరిశీలించి రాకపోకలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ మార్గంలో ప్రయాణించకుండా సహకరించాలని పోలీసులు సూచించారు.

# విద్యార్థుల ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు

**● సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 20 వరకు నిర్వహణ ● జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**



**విజయవాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆధార్ వివరాల నవీకరణకు ఈ నెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఆధార్ నమోదు చేసుకోని విద్యార్థులతో పాటు మ్యాండటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (వీదీఖ) చేయించుకోవాల్సిన విద్యార్థులకు ఈ ప్రత్యేక శిబిరాల ద్వారా ఆధార్ సేవలను అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఆధార్ సంబంధిత సేవలను మరింత చేరువ చేసేందుకు స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, విద్యార్థులందరికీ నూరు శాతం ఎంబియు పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. శిబిరాల్లో ప్రతిరోజూ అందించిన ఆధార్ సేవల వివరాలను సేకరించి, కార్యక్రమం పురోగతిని నిరంతరం పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాలో అవసరమైన పాఠశాలలను శిబిరాల నిర్వహణకు ఎంపిక చేసి, ఆధార్ కిట్లు, సిబ్బంది, ఇతర అవసరమైన సదుపాయాలను సమకూర్చనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, ఇతర అవసరమైన ఆధార్ వివరాలను సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు.

# తిరుపతి జిల్లా గ్రామీణ విలేఖరులకు అక్టోబర్ 3, 4, తేదీల్లో పునశ్చరణ తరగతులు

**● శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం "సెనేట్ హాల్"లో సి.ఆర్.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహణ. ● సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ వెల్లడి**

**విజయవాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** సి.ఆర్.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా గ్రామీణ విలేఖరులకు రెండు రోజుల పాటు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం "సెనేట్ హాల్" లో ఈ తరగతులు అక్టోబర్ 3, 4, తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖుల ద్వారా పత్రికా కథనాల కు సంబంధించి వివిధ అంశాలపై గ్రామీణ విలేఖరులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వార్తా కథనాలు రాయడం లో "కృత్రిమ మేధ" (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) వంటి ఆధునిక పద్ధతుల వినియోగాన్ని గురించి ఈ తరగతుల్లో వివరించడం జరుగుతుందని తెలిపారు.ఈ అంశం పై సీనియర్ జర్నలిస్టు విజయకుమార్ కుర్రా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరంగా తెలియచేస్తారని ఆయన తెలిపారు. గ్రామీణ రిపోర్టింగ్ లో మెళుకువలు, విలేఖరుల నుంచి డెస్క్ ఏమి కోరుకుంటుంది, "క్రైమ్ రిపోర్టింగ్" పై మెళకువలు, "పత్రికా భాష" వంటి అంశాల పై రెండురోజుల పునశ్చరణ తరగతుల్లో గ్రామీణ విలేఖరులకు పూర్తి స్థాయి శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ లో పాల్గొన్న గ్రామీణ జర్నలిస్టులకు సి.ఆర్.మీడియా అకాడమీ తరఫున "సర్టిఫికెట్లు", శిక్షణ ఇచ్చే అంశాలపై అకాడమీ ప్రచురించిన పుస్తకాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణలో పాల్గొన దలచిన తిరుపతి జిల్లా గ్రామీణ విలేఖరులు తమవివరాలు అక్టోబర్ 2 వ తేదీ లోపు దిగువ పేర్కొన్న "ఆన్ లైన్ లింక్ (గూగుల్ షీట్)" లో నమోదు చేసు కోవాలని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ సూచించారు. నమోదు చేసు కోడానికి ఆన్ లైన్ లింక్ (గూగుల్ షీట్): https://docs.google.com/forms/d/e/1FAIpQLSeDs0qhbCAOYUNSnR1_MY_WOUWZuMZcgT1dNdUEuCU9wIPpqQ/viewform?usp=header

# అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యశీ అని ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. పెనుగంచిప్రోలు గ్రామంలో పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి నూతన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి, వారు ప్రశాంతమైన మరియు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఏ సి ఆర్ ఎస్ -- ఏ డబ్ల్యు పి మరియు బి- నిధుల ద్వారా రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ అదనపు తరగతి గదులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ,మాజీ జెడ్ పిటిసి గజ్జి కృష్ణ మూర్తి యాదయ్ గ్రామ టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్ కుమార్ కొలిపాక బ్రాహ్మం నాగేశ్వ ర రావు కంచ పోగు రవి పూర్ణ ముసిబోయి న కృష్ణ లగడపాటి ప్రవీణ్ నల్లపునేని కొండ జిల్లేపల్లి సుదీర్ బాబు మహమ్మద్ అజాద్ కంభం చిరంజీవి ముళ్లపాటి రాము పెనుగొండ కొండలు వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్స్ ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారు-రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ

**● "త్రిశూల్ వ్యూహం" పై ఇంజనీరింగ్ విద్యార్థు లకు అవగాహన**





**మైలవరం,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** స్కిల్స్ ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ (ఐపీఎస్) పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, మైలవరం ఏసీపీ రామచంద్రరావు సమక్షంలో, మైలవరం లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో "త్రిశూల్ వ్యూహం"పై గురువారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కు ముఖ్య అతిథిగా విచ్చేసిన రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ మహిళల భద్రత,రోడ్డు భద్రత, డ్రగ్స్ నియంత్రణ అనే మూడు ప్రధాన అంశాల ను "త్రిశూల్"లోని మూడు శూలాలుగా తీసుకొని, యువతలో బాధ్యత, క్రమశిక్షణ, సామాజిక స్పృహ పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా అనుకున్న ఆశయాలను సాధించుకోవచ్చని తెలిపారు. కేవలం కష్టపడటం మాత్రమే విజయానికి సరిపోదని, కష్టంతో పాటు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచు కునే వారే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుం టారని తెలిపారు. లక్ష్యాన్ని సాధించేందుకు సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, నిరంతర సాధన, నైపుణ్యాభివృద్ధితో పాటు అన్నింటికంటే ముఖ్యంగా కమిట్మెంట్ ఉండాలని అన్నారు. "ఫిక్స్ యువర్ గోల్ -- ఇంప్రూవ్ యువర్ స్కిల్స్-వర్క్ హార్డ్-స్టే కమిటెడ్, సక్సెస్ విల్ ఫాలో "అనే స్ఫూర్తిదాయ క సందేశాన్ని విద్యార్థులకు అందించారు.

**మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత:** మహిళల భద్రతపై అవగాహన కల్పిస్తూ, మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. స్నేహం లేదా ప్రేమ పేరుతో వేధించడం, వెంటపడటం, బెదిరించడం లేదా ఒత్తిడి చేయడం వంటి ప్రవర్తనకు దూరంగా ఉండాలని సూచించారు. "చీఃశీ అంటే చీఃశీ" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని స్పష్టం చేశారు.

**రోడ్డుపై క్షణిక నిర్లక్ష్యం -- జీవితాంతం బాధ:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దని తెలిపారు.

**డ్రగ్స్‌కు "NO"--భవిష్యత్తుకు "ES":** యువత డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. క్షణిక సరదా లేదా స్నేహితుల ఒత్తిడితో ప్రారంభమయ్యే మత్తు పదార్థాల అలవాటు చదువు, ఆరోగ్యం, కుటుంబం, కెరీర్ తో పాటు మొత్తం భవిష్యత్తును దెబ్బతీస్తుందని వివరించారు. తోటి విద్యార్థులు డ్రగ్స్ వైపు ఆకర్షితులవుతున్నట్లు గుర్తిస్తే వారిని ప్రోత్సహించకుండా, సరైన మార్గంలో నడిపేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. కిషోర్ బాబు కొత్తూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో మైలవరం, జి.కొండూరు,రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్,సతీష్ కుమార్, శ్రీను, 2వ ఎస్ఐలు గిరి, శ్రీ సాయి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.అప్పారావు సుమారు 800 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకాకుళేశ్వర స్వామి పవిత్రోత్సవాలు..



**● పూర్ణాహుతి సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు.**

**ఘంటసాల/అవనిగడ్డ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఆంధ్రుల తొలి రాజధాని నగరంగా గుర్తింపు కలిగిన చారిత్రక గ్రామం ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఆంధ్ర మహా విష్ణువు దేవస్థానంగా భాసిల్లుతున్న శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం పవిత్రోత్సవాలకు ముఖ్య అతిథులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు విచ్చేయగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. దేవస్థానంలో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులుచే ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామి వారికి హారతులు ఇచ్చారు. ముత్తేవి వెంకట సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో దేవస్థాన ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు హోమగుండం వద్ద ప్రత్యేక హోమాలను నిర్వహించగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దంపతులు పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా వారికి వేద పండితులు వేద ఆశీర్వచనాలను , తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు,భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ఘాతానికి గురై మహిళ మృతి..



**మోపిదేవి/అవనిగడ్డ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లిలో తెగిపడిన విద్యుత్ వైరుకు తగిలి దారపురెడ్డి సామ్రాజ్యం (55) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆమె ప్రతిరోజు మాదిరిగానే ఇంటి సమీపంలోని రామాలయం వద్దకు వెళ్తుండగా, వర్షాల కారణంగా తెగిపడి ఉన్న ఎల్టీ (లో టెన్షన్) కరెంటు వైరును గమనించక తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు. వర్షాల వేళ ప్రజలు విద్యుత్ స్తంభాలు, తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# స్పెషల్ ఆఫీసర్ ఆన్ డ్యూటీ



**విస్సన్నపేట,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చార్జ్ తీసుకున్న ఫిషరీస్ జిల్లా అధికారిణి చక్రాణి విస్సన్నపేట మండలం ప్రత్యేక అధికారిణిగా చార్జ్ తీసుకున్న నిమిషము నుండి మండలంలో పడుతున్న వర్షాలు కారణంగా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కంకిపాడులో అత్యధిక వర్షపాతం





**కంకిపాడు,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లాలో విస్తారంగా వర్షాలు, జిల్లాలో అత్యధికంగా కంకిపాడులో 24.4 మి.మీ నమోదు కృష్ణా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 8:30 గంటల నుంచి 11:00 గంటల వరకు నమోదైన వివరాల ప్రకారం జిల్లా సగటు వర్షపాతం 12.9 మి.మీ కాగా, మొత్తం వర్షపాతం 336.4 మి.మీ గా నమోదైనట్లు అధికారులు తెలియజేశారు. జిల్లాలోనే అత్యధికంగా కంకిపాడు మండలంలో 24.4 మి.మీ వర్షపాతం నమోదవ్వగా, ఉయ్యూరులో 21.8 మి.మీ, అత్యల్పంగా కృతివెన్నులో 3.6 మి.మీ వర్షపాతం రికార్డయింది.

**ఎడతెరిపి లేని వర్షాలతో స్తంభించిన జనజీవనం..** కంకిపాడు మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. భారీ వర్షాల ప్రభావంతో పల్లపు, లోతట్టు ప్రాంతాలు, జలమయంగా మారాయి. కంకిపాడు మండలంలోని పునాదిపాడు, కంకిపాడు సర్వీస్ రోడ్డు, గ్రామాల్లోని ప్రధాన రహదారులు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కోలవెన్ను, ఉప్పలూరు, తెన్నేరు, దావులూరు, వేల్పూరు, గొడవర్రు,జగనన్న కాలనీలో మద్దూరు గ్రామాల్లోని హరిజనవాడల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో వర్షపు నీరు నివాస ప్రాంతాల్లోకి చేరి, పలు ఇళ్లలోకి కూడా ప్రవేశించింది. వర్షపు నీరు ఇళ్ల చుట్టూ నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించడంతో పాటు, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# డైరెక్టర్ పోస్టుకు ఫీడర్ కేటగిరీని పరిగణనలోకి తీసుకోవడం హర్షణీయం

**-ఏపీ పశుసంవర్ధక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్**



**అమరావతి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ పోస్టుకు ఫీడర్ కేటగిరీ అధికారులను పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం http://G.O.Rt.No.325, తేదీ 22.09.2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఏపీ పశు సంవర్ధక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్వాగతిస్తోంది. ఈ నేపథ్యంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డా. సి.హెచ్.ఎస్. కృష్ణారావులి ఆధ్వర్యంలో ప్రతినిధులు గురు వారం రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లి బి. రాజశేఖర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఏపీ షీప్ ఁ గోట్ డెవలప్మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ యల్.టీ.డి ఎండీ డా. ఆర్. అమరేంద్ర కుమార్ కి పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఫుల్ అడిషనల్ ఛార్జ్ ) అప్పగించారు. ఈ నిర్ణయం చట్టబద్ధమైన సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా పరిపాలన కొనసాగేందుకు, శాఖలో అధికారుల సేవా హక్కులు, పదోన్నతి అవకాశాలు, ప్రమోషనల్ ఛానల్ పరిరక్షణకు దోహదపడుతుందని అసోసియేషన్ పేర్కొంది. భవిష్యత్తులో కూడా సర్వీస్ రూల్స్ అమలులో ప్రభుత్వం ఇదే సహకారం అందించాలని కోరారు.

# పెడన మండల స్పెషల్ ఆఫీసర్ గా సాంబశివరావు



**పెడన,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** పెడన మండల పరిషత్తు ప్రత్యేక అధికారిగా ఎన్ వి సాంబశివరావు నియమితులయ్యారు. మేరకు కలెక్టర్ డీకే బాలాజీ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీ పట్నంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గా సాంబశివరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన వైసీపీ మండల పరిషత్తు పాలకవర్గం కాలపరిమితి పూర్తి అయిన సంగతి తెలిసిందే.

# ఒత్తిడిని అధిగమించి.. ఆత్మవిశ్వాసంతో ముందడుగువేసి

**- విజయవంతంగా ఒత్తిడి నివారణ అవగాహన కార్యక్రమం**



**విజయవాడ,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు సిబ్బందికి మానసిక ఒత్తిడిని గుర్తించడం, నియంత్రించడం, దాన్ని అధిగమించే విధానాలపై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ జ్యోతి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి రావడం సహజమేనని, అయితే దాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు నిత్యం వ్యాయామం, నడక, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, సమయపాలన, ముందస్తు ప్రణాళిక వంటి అలవాట్లను పాటించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సైకాలజిస్ట్ డాక్టర్ టి.ఎస్. రావు మాట్లాడుతూ అధిక మానసిక ఒత్తిడి ఆలోచనా విధానం, విశ్లేషణాత్మక సామర్థ్యం, పనిపట్ల ఆసక్తిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. కార్యాలయంలో ఎదురయ్యే ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఆఫీసు ఒత్తిడి కుటుంబ సభ్యులు, పిల్లలపై ప్రభావం చూపకుండా చూసుకోవాలని, కుటుంబ సభ్యులతో సంతోషంగా, సానుకూలంగా సమయం గడపడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. సైకాలజిస్ట్ జగదీశ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గత 18 వారాలుగా ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయ అధికారి జి.జ్యోతి, ఆకర్ష ఫౌండేషన్ అధ్యక్షుడు డా. గర్రె శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆగిరిపల్లి మండల ప్రత్యేకాధికారిగా ఈపూరి బాధ్యతల స్వీకరణ



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండల ప్రత్యేకాధికారిగా ఈపూరి విలియం బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలియం బాబు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188